నేటి అలంకారం సరస్వతీదేవి

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కృష్ణా జిల్లా వార్తలు

సోమవారం 29 సెప్టెంబరు 2025







సమయం రాత్రి 10.30

ఇంద్రకీలాద్రికి గండ దీపాలతో వస్తున్న భక్తులు



సమయం రాత్రి 11.00

కంపార్టమెంట్లలో వేచి ఉన్న భక్తులు



సమయం రాత్రి 12.00

దర్శనానికి వెళ్తున్న భక్తులు



ఆదివారం రాత్రి 11.00 గంటలకు కంపార్టమెంట్లలో పోటెత్తిన భక్తులు







ప్రత్యేక పూజలు, హోమాలు, నగరోత్సవం, సాంస్కృతిక ప్రదర్శనలతో ఇంద్రకీలాద్రి దేదీప్యమానంగా వెలిగిపోతోంది. భక్తుల జయ జయధ్వానాలకు తన్మయత్వం చెందుతోంది. దేవతల కార్యసిద్ధి, దుష్టశిక్షణ, శిష్ట రక్షణ కోసం మహాలక్ష్మి, మహాకాళీ, మహా సరస్వతి త్రిశక్తి స్వరూపిణిగా ఉద్భవించిన మహాచండీగా కనకదుర్గమ్మ ఆదివారం దర్శనమిచ్చారు. అనేక మంది దేవతలు కొలువై ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని పరవశించారు. విద్య, కీర్తి, సంపదలను ప్రసాదించే తల్లీ.. చల్లగా చూడమ్మా అంటూ మనసారా చండికాదేవిని వేడుకున్నారు.

చల్లగా చూడమ్మా.. మహాచండికా..

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

- మహాచండీదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ
- నిమిషానికి 100 మంది భక్తులకు దర్శనం
- ఆదివారం అర్ధరాత్రి భారీగా వస్తున్న భక్తులు


(ఆంధ్రజ్యోతి - విజయవాడ): ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తారు. కనకదుర్గమ్మ ఆదివారం మహాచండీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే భక్తులు క్యూల్లోకి చేరుకున్నారు. పోలీసులు, దేవస్థాన అధికారులు గడచిన

మిగతా 8లో..



గానం ఆలపిస్తున్న సంగీత దర్శకుడు రామ్ మిర్యాల

నేడు అమ్మవారికి ముఖ్యమంత్రి పట్టువస్త్రాల సమర్పణ



ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గమ్మ జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని సరస్వతీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారికి సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. సీఎం రాక సందర్భంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. ఆదివారం ఇంద్రకీలాద్రిపై మీడియా పాయింట్ నుంచి పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, ఈవో శీనానాయక్‌తో కలిసి మాట్లాడారు. కృష్ణానదికి వరద పెరిగిన దృష్ట్యా భక్తులు ఘాట్లలోకి దిగవద్దని సూచించారు. పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ భక్తుల రద్దీ నేపథ్యంలో అదనంగా ఏపీఎస్పీ ప్లటూన్లను రప్పిస్తున్నామని తెలిపారు. రెండు శాతం మంది మాత్రమే

మిగతా 8లో..

అవనిగడ్డలో డయేరియా కలకలం

వాంతులు, విరేచనాలతో పదిమంది ఆస్పత్రిపాలు

అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు



అవనిగడ్డ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

అవనిగడ్డ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన అవనిగడ్డలో డయేరియా కలకలం రేపుతోంది. మూడు రోజులుగా డయేరియా లక్షణాలతో పది మంది ఆస్పత్రి పాలయ్యారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అవనిగడ్డ పంచాయతీలోని 7, 8 వార్డుల్లో గడిచిన మూడు రోజులుగా డయేరియా కేసులు నమోదవుతున్నాయి. శనివారం రాత్రికి పది మందికిపైగా రోగులు అవనిగడ్డ ఏరియా ఆస్పత్రిలో చేరారు. ఆదివారం ఉదయానికి అవనిగడ్డ ఆసుపత్రిలో 10 మంది రోగులు డయేరియా లక్షణాలతో చికిత్స పొందుతుండగా, మరో ఇరువురు విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ముగ్గురు పిల్లలు బయట

మిగతా 8లో..

అద్దె భవనాలే దిక్కు!

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువు

- జిల్లా విభజన జరిగి నాలుగేళ్లు అయినా సమకూరని సౌకర్యాలు
- నిలిచిన తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయ భవనాల నిర్మాణం
- విజయవాడలోనే అధికారుల మకాం!
- పట్టించుకోని అధికారులు



పునాదుల దశలోనే ఆగిపోయిన ఆర్డీవో కార్యాలయ భవనం

జిల్లాల విభజన జరిగి నాలుగేళ్లు అయినా ఇంత వరకు వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు సమకూరలేదు. అద్దె భవనాల్లోనే అధికశాతం కార్యాలయాలు నేటికీ నడుస్తున్నాయి. ఏ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియక వివిధ పనులపై వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాగా ఉన్న సమయంలో విజయవాడలోనే మకాం ఉన్న అధికారులు, జిల్లా విడిపోయిన తర్వాత కూడా అక్కడే నివాసం ఉంటున్నారు. చుట్టంచూపుగా మచిలీపట్నం వచ్చి వెళుతున్నారు. కలెక్టర్, జేసీ, డీఆర్వో మినహా మిగిలినశాఖల అధికారులు జిల్లా హెడ్‌క్వార్టర్‌లో నివాసం ఉండటం లేదని విమర్శలు వస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో అధిక శాతం ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు మాత్రం పాత భవనాల్లోనే ప్రస్తుతం నడుస్తున్నాయి. సర్వశిక్ష అభియాన్, గృహ నిర్మాణశాఖ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజరు కార్యాలయం, బీసీ కార్పొరేషన్, అటవీశాఖ, పరిశ్రమలు, దేవదాయశాఖ, మార్కెటింగ్ శాఖ, భూగర్భ, గనులశాఖ, ఖనిజశాఖ, భూగర్భ జలఅధికారి కార్యాలయం, ఎక్సైజ్ విభాగం సూపరింటెండెంట్ తదితర కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఈఈ, డీవైఈఈవో కార్యాలయాలను నోబుల్ కళాశాల ఎదురుగా ఉన్న పాతభవనంలో నిర్వహిస్తున్నారు. విద్యుత్ శాఖ ఎస్ఈ, ఈఈ కార్యాలయాలను మచిలీపట్నం డివిజన్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో

మిగతా 8లో..

కలెక్టర్, జేసీ కార్యాలయాలను ఆధునీకరించి సరిపెట్టారు..

జిల్లా విభజన తర్వాత కలెక్టర్, జేసీ కార్యాలయాలను కొంతమేర ఆధునీకరించి సరిపెట్టారు. వ్యవసాయ ఆధారితమైన కృష్ణాజిల్లాలో కీలకమైన జలవనరులశాఖ ఎస్ఈ పోస్టును ఎన్టీఆర్ జిల్లా పరిధిలోనే ఉంచారు. విజయవాడ నుంచే ఈ శాఖకు సంబంధించిన పరిపాలన కొనసాగుతోంది. జలవనరులశాఖకు కృష్ణాఈస్ట్రన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) కార్యాలయాన్ని గుడివాడలో ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఇటీవల కాలంలో తెరపైకి వచ్చింది. దీంతో ఈఈ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులంతా తమ కార్యాలయాన్ని విజయవాడలోనే ఉంచాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వద్దకు వచ్చారు. ఈ ప్రతిపాదనను అంగీకరించని ఆయన, ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో జలవనరులశాఖ ఈఈ కార్యాలయాన్ని గుడివాడలో ఏర్పాటు చేయాలని కోరారు. జలవనరులశాఖ ఈఈ కార్యాలయానికి సంబంధించి గుడివాడలో భవనాలు ఉన్నా, విజయవాడలోనే ఈ కార్యాలయం నేటికీ నడపడం గమనార్హం.

మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, చిత్రంలో ఎంపీ కేశినేని చిన్ని తదితరులు



ఆనంద ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

ఆ దిశగా డబుల్ ఇంజన్ సర్కార్ కృషి

విజయవాడ ఉత్సవ్ - 2025 వేడుకల్లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్

విజయవాడ సిటీ , సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ డబుల్ ఇంజన్ సర్కార్ ఏపీని ఆనంద ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ అన్నారు. భవానీపురం పున్నమి ఘాట్‌లో జరుగుతున్న విజయవాడ ఉత్సవ్‌కు ఆదివారం రాత్రి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దసరా సందర్భంగా విజయవాడ ఉత్సవ్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ కృషి స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతి జిల్లాలోనూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు

మిగతా 8లో..

సమసమాజ నిర్మాణ స్ఫూర్తి ప్రదాత గుర్రం జాషువా

8లో

కృష్ణమ్మ పరవళ్లు

ప్రకాశం బ్యారేజీ నుంచి 6.39 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల

- కడలివైపు పరుగులు తీస్తున్న వరద
- పులిగడ్డ ఆక్విడెక్ట్ గ్రిల్స్ తొలగింపు
- లంక గ్రామాలు, పంట పొలాల్లోకి చేరుతున్న నీరు
- నేటి ఉదయానికి 7 లక్షల క్యూసెకుల వరకు పెరిగే అవకాశం



మోపిదేవి మండలం కే-కొత్తపాలెంలో పసుపుతోటల్లోకి చేరిన నీరు

గ్రామాల్లోకి వరద నీరు

కృష్ణానదిలో వరద ప్రవాహం ఆదివారం మధ్యాహ్నం నుంచి క్రమంగా పెరుగుతోంది. మోపిదేవి మండలం కే.కొత్తపాలెం, బొబ్బర్లంక గ్రామాల్లోకి వరద నీరు చేరింది. చల్లపల్లి

మిగతా 8లో..

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఎగువ నుంచి కృష్ణానదికి భారీగా వరద వస్తోంది. ఆదివారం రాత్రి ఎనిమిది గంటల సమయానికి ప్రకాశం బ్యారేజీ నుంచి 6.39 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సోమవారం నాటికి వరద ఏడు లక్షల క్యూసెక్కుల వరకు చేరే అవకాశం ఉందని జలవనరులశాఖ ఈఈ రావెళ్ల రవికిరణ్ తెలిపారు. వరద ఉధృతి పెరగడంతో పులిగడ్డ ఆక్విడెక్ట్‌కు ఉన్న గ్రిల్స్‌ను తొలగించారు. అర్ధరాత్రి సమయానికి వరదనీరు మరింతగా దిగువకు విడుదల చేయనున్నారనే హెచ్చరికలతో రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ విభాగం అధికారులు కృష్ణానది పరివాహక ప్రాంతంలోని లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.



మహా చండీ..







ఇంద్రకీలాద్రి భక్తులతో పోటెత్తింది. ఆదివారం సెలవు కావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఏడోరోజు దుర్గమ్మ మహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున 4 గంటలకే క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. వీఐపీల తాకిడితో సామాన్యులకు ఇబ్బందులు తప్పలేదు.

దుర్గమ్మ సేవలో..

ఆదాయం రూ.38.90 లక్షలు

ఇంద్రకీలాద్రి: దుర్గగుడిలో దసరా మహోత్సవాలలో ఆరోరోజైన శనివారం దేవస్థానానికి రూ. 38,90,856 ఆదాయం వచ్చినట్టు ఈవో శీనానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 15 లడ్డు ప్రసాద విక్రయం ద్వారా రూ 4,24,500, రూ. 100 లడ్డు ప్రసాద విక్రయం ద్వారా రూ.31,05,000 వచ్చినట్టు తెలిపారు. పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన సేవ ద్వారా రూ.39 వేలు (టికెట్ రూ 3000), పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన ద్వారా రూ.20 వేలు (టికెట్ రూ 5000), చండీ హోమం ద్వారా రూ. 8 వేలు, ప్రత్యేక ఖడ్గమాలార్చన ద్వారా రూ.30,696 పుస్తకాలు, ఫొటోలు, కాలెండర్లద్వారా రూ 13,345, తలనీలాల సమర్పణ రుసుం ద్వారా రూ.92,360, ఇతరత్రా ఆదాయం రూ5,500, యూపీఐ ద్వారా రూ.1,52,455 ఆదాయం సమకూరింది



ఈవోకు బంగారు ఆభరణాలను అందజేస్తున్న రాజేష్ కుటుంబసభ్యులు

కనకదుర్గమ్మకు బంగారు హారం, పట్టీలు కానుక

ఇంద్రకీలాద్రి : కనకదుర్గమ్మకు అలంకరణ నిమిత్తం బెంగుళూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సీఎం రాజేష్ భార్య ప్రకృతి పేరిట రూ.10 లక్షల విలువైన 90 గ్రాముల పట్టీలు, హారం కానుకగా సమర్పించారు.కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం దుర్గమ్మను దర్శించుకున్న రాజేష్ ఈవో శీనానాయక్‌కు ఆభరణాలను అందజేశారు. గొల్లపూడికి చెందిన శ్రీమంజూష దేవస్థాన బోర్డు ఛైర్మన్ రాధాకృష్ణను కలిసి ఉచిత ప్రసాదం పంపిణీకి రూ. లక్ష విరాళం అందజేశారు.





జస్టిస్ కిరణ్మయి దంపతులు | రిటైర్డ్ జడ్జిలు కృపాసాగర్, సునీల్ చౌదరి దంపతులు | అజయ్ జైన్ దంపతులు, విజయానంద్ | మహారాష్ట్ర ఎంపీ షిండే | నక్కా ఆనందబాబు, జ్యోతిసురేఖ

ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక రంగాలకు ప్రాధాన్యం

» మంత్రి కందుల దుర్గేష్

ఇంద్రకీలాద్రి,సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా పర్యాటక రంగాలకు పెద్దపీట వేస్తున్నట్టు మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం ఇంద్రకీలాద్రిపై మహాచండీ అలంకారంలో కనకదుర్గమ్మను కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలుకగా.. అమ్మవారి దర్శనం అనంతరం వేదపండితులు ఆశీస్సులు అందజేశారు. అనంతరం మంత్రిర మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా పర్యాటక రంగాలకు కూటమి ప్రభుత్వంలో పెద్దపీట వేస్తున్నట్టు తెలిపారు. దసరా ఉత్సవాలలో ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయన్నారు. ఎంపీ కేశినేని చిన్ని, 'సొసైటీ ఫర్ విజయవాడ వైబ్రంట్' పేరిట విజయవాడలో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్‌కు పర్యాటక శాఖ తోడ్పాటునందిస్తోందన్నారు.

దుర్గమ్మ ఆశీస్సులతో అభివృద్ధి పథంలో..

» మంత్రి సవిత



కనకదుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళతుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. ఆదివారం కనకదుర్గమ్మకు చేనేత జౌళిశాఖ కమిషనర్ రేఖారాణితో కలిసి పట్టువస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గమ్మ చల్లని దీవెనలతో సీఎం చంద్రబాబునాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు.

వీఐపీల పేరుతో అడ్డదారిలో..

» కొండపై గేట్ల వద్ద గుమిగూడుతున్న జనం

» పోలీసులతో వాగ్వాదం.. తోసుకుంటూ ముందుకు పోతున్నవైనం

ఇంద్రకీలాద్రి,సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మదర్శనానికి వీఐపీల పేరిట విపరీతమైన తాకిడి నెలకొంది. ఘాట్ రోడ్డుమీదుగా ఓం మలుపు వద్ద పోలీసు బ్యారికేడింగ్, కొండపైన చినరాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేసిన మీడియా పాయింట్ గేటు వద్ద, మరో పోలీసు బారికేడింగ్‌ల వద్ద జనం గుమిగూడుతున్నారు. వారిలో ఎవరు వీఐపీలో తెలియని పరిస్థితి. వీఐపీలకు స్లాట్‌లు ఇచ్చినప్పటికీ బేఖాతర్ చేస్తూ ఇష్టారాజ్యంగా వస్తున్నారు. గంటల తరబడి క్యూలలో సామాన్య భక్తులు పడిగాపులు పడుతుంటే వీరు మాత్రం అడ్డదారిలో దర్శనాలకు పంపాల్సిందేనని పోలీసులతో వాగ్వావాదానికి దిగుతున్నారు. వీరిని కట్టడి చేయడం ఎవరి తరం కావడం లేదు.

స్వీయ నియంత్రణ పాటించండి..

» ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)



విజయవాడ : మూలా నక్షత్రం రోజు ఎటువంటి పాసులకు అనుమతి ఉండదని, వీఐపీ దర్శనానికి వచ్చేవారు స్వీయ నియంత్రణ పాటిస్తే సామాన్య భక్తులు సత్వరమే దర్శనం చేసుకోగలుగుతారని ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. ఆదివారం మహాచండీ అలంకరణలో అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ, భక్తుల రద్దీకనుగుణంగా ఆలయ, ఇతర శాఖలకు చెందిన అధికారులు ఏర్పాట్లు చేశారన్నారు. కనకదుర్గమ్మ జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం రోజున అమ్మవారి దర్శనానికి సుమారు రెండు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశమున్నట్టు దేవస్థాన అధికారులు తెలిపారన్నారు. సామాన్య భక్తులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు నిరంతరం సమీక్షిస్తున్నారన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మహా చండీదేవిని వేడుకున్నానన్నారు.



వీఐపీల పేరుతో ఓం టర్నింగ్ వద్ద పోలీసు బీట్ బ్యారికేడ్లను తోసుకుంటూ వస్తున్న జనం, మీడియా పాయింట్ గేట్ వద్ద..

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం దసరా మహోత్సవాలలో ఆదివారం మహాచండీ అలంకారంలో ఉన్న కనకదుర్గమ్మను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారందరికీ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించారు. ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి విజయానంద్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్, ఈవో శీనానాయక్‌లు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. జస్టిస్ మండవ కిరణ్మయి దంపతులు, ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి అజయ్ జైన్ దంపతులు, మహారాష్ట్ర ఎంపీ శ్రీకాంత్ షిండే, రిటైర్డ్ జడ్జి కృపాసాగర్ దంపతులు, రిటైర్డ్ జడ్జి సునీల్ చౌదరి దంపతులు, తణుకు ఎమ్మెల్యే ఎ. రాధాకృష్ణ, నక్కా ఆనందబాబులు, మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతి సురేఖ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం వారికి శేషవస్త్రం,ప్రసాదం, ఆశీస్సులు, చిత్రపటం ఆలయ అధికారులు అందజేశారు.



రామవరప్పాడు రింగ్ నుంచి డ్రోన్ కెమెరాతో భక్తుల రద్దీని పరిశీలిస్తున్న ట్రాఫిక్ డీసీపీ తిరుమలేశ్వర్ రెడ్డి, అధికారులు

డ్రోన్ కెమెరాతో ట్రాఫిక్ సమస్యకు చెక్

గుణదల : ఇంద్రకీలాద్రికి ఆదివారం రాత్రి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానుండటంతో డ్రోన్ కెమెరా ద్వారా ట్రాఫిక్ సమస్యకు డీసీపీ తిరుమలేశ్వర్ రెడ్డి చెక్ పెట్టారు. రామవరప్పాడు రింగ్ నుంచి డ్రోన్ కెమెరాద్వారా సిబ్బందితో కలిసి రద్దీని క్రమబద్ధీకరిస్తున్నారు. మూలా నక్షత్రం కావడంతో సోమవారం దుర్గమ్మను సరస్వతిదేవి అలంకారంలో దర్శించుకునేందుకు భక్తులు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలి రానున్న సందర్భంగా ఆయన ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. డీసీపీతో పాటుగా సీఐ సురేష్ కుమార్, ఆర్ఎస్ఐ ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

గుండె ఆరోగ్యానికి కొత్త భవిష్యత్తు ప్రెసిషన్ రీజనరేటివ్ మెడిసిన్

» భవిష్యత్తులో మనిషి జీవనకాలం పెంచే అవకాశం

» వ్యక్తిగత జీన్స్ ఆధారంగా చికిత్స రేపటి వైద్య విప్లవం

» చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రమేష్ బాబు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గుండెను కాపాడుకోవటానికి మంచి జీవనశైలి అలవాటు చేసుకుంటే.. ప్రెసిషన్ మెడిసిన్, రీజనరేటివ్ మెడిసిన్స్ ద్వారా మానవ జీవితాన్ని వందేళ్లకు పైగా ఆరోగ్యవంతంగా ఉంచవచ్చని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చీఫ్ కార్డియాలజిస్ట్ పోతినేని రమేష్ బాబు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం మిలియన్ల మంది గుండెజబ్బులతో ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రెసిషన్ మెడిసిన్ రీజనరేటివ్ మెడిసిన్ వంటి సరికొత్త వైద్య సాంకేతికతను పూర్తిగా మార్చేశక్తి కలిగి ఉన్నాయని ఆయన అన్నారు. 'వరల్డ్ హార్ట్‌డే' సందర్భంగా గుండె ఆరోగ్యానికి సంబంధించి ఆయన పలు కీలక విషయాలు ఆదివారం మీడియాతో పంచుకున్నారు. గుండె జబ్బుల కారణంగా ప్రాణాలు కోల్పోయేవారికి వ్యక్తిగత జీన్స్ ఆధారంగా చికిత్సనందించటం రేపటి వైద్య విప్లవంగా అభివర్ణించారు. జీనోమిక్ డేటా, జీవనశైలి, పరిసరాల ఆధారంగా ప్రత్యేక చికిత్సలు నిర్వహించటం అన్నది ప్రెసిషన్ మెడిసిన్ కిందకు వస్తుందన్నారు. ఒకే మందు అందరికీ కాకుండా ప్రతి వ్యక్తి జీన్స్‌కు తగిన చికిత్సే భవిష్యత్తు అని చెప్పారు. శరీర కణజాల పునర్నిర్మాణమే రీ జనరేటివ్ మెడిసిన్ అని, దెబ్బతిన్న అవయువాలను తిరిగి పునరుద్ధరించడం కోసం ఇది ఉపయోగపడుతుందన్నారు. అవయువ పునసృష్టికి ఇండ్యూస్డ్ ప్లూరిపోటెంట్ స్టెమ్ సెల్స్ (ఐపీఎస్‌సీ) దోహదపడుతుందని తెలిపారు. సైన్స్, జెనోమిక్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కలిసినపుడు మానవ ఆరోగ్యానికి సరికొత్త పటం ఆవిర్భవిస్తుందని చెప్పారు.

కృష్ణాకు వరద ఉధృతి

» గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం

» పలుచోట్ల నిలిచిన రాకపోకలు

» నీట మునిగిన పంట పొలాలు



రావిరాల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

జగ్గయ్యపేట రూరల్/కంచికచర్ల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదికి వరద పోటెత్తటంతో తీరగ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఎగువ నుంచి వస్తున్న వరదతో ముక్త్యాల, రావిరాల గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలకు వరద నీరు చేరటంతో రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు నీటమునిగాయి. వేదాద్రి వద్ద కృష్ణానది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. పులిచింతల నుంచి ఐదు గేట్లలో 6.27 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు నాగార్జునసాగర్, మూసీ వరదతో పాటు వాగులు, వంకలు పొంగి కృష్ణానదిలో కలుస్తున్నాయి. 6.10లక్షల నుంచి 6.50 లక్షల క్యూసెక్కులకు పైగా వరద పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పరీవాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. ముక్త్యాలలో రక్షణ గోడను తాకుతూ కృష్ణమ్మ ప్రవహిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రావిరాల వద్ద కృష్ణానది, పాలేటి వరద తాకిడికి ఒడ్డున ఉన్న గృహాల వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. వరద పెరిగితే ఏ క్షణంలోనైనా తరలివెళ్లేందుకు సిబ్బంది ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కృష్ణా పరివాహక గ్రామాల్లో అధికారులు హైఅలెర్ట్ ప్రకటించారు. వరద నీటితో ముక్త్యాల వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. చంద్రమ్మ కయ్య పొంగి పొర్లుతుండటంతో జగ్గయ్యపేట-ముక్త్యాల రహదారిని మూసివేశారు. తెలంగాణాలోని పలు సిమెంట్ కర్మాగారాలు, పులిచింతలకు వెళ్లే ప్రధాన రహదారి కావటంతో వాహనాలు నిలిచిపోయాయి. రావిరాల గ్రామంలోని కనిగడ్డ కయ్య ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వరి, మొక్కజొన్న, పత్తి, మిర్చి, కంది, తదితర పంటలు 30 ఎకరాల మేర పంటలు నీట మునిగాయని రైతులు పేర్కొన్నారు. చిల్లకల్లు, జగ్గయ్యపేట ఎస్ఐలు తోట సూర్య శ్రీనివాస్, రాజు, కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శివాజీ, రెవెన్యూ అధికారులు పరిస్థితిని పరిశీలించారు.



ముక్త్యాల వద్ద చంద్రమ్మ కయ్యపై ప్రవహిస్తున్న నీరు

లోతట్టు ప్రాంతాలు జలమయం..

ఆదివారం సాయంత్రం పులిచింతల ప్రాజెక్టు, కట్లేరు, వైరాయేరు, మునేరు ఇతర వాగుల నుంచి వరద పోటెత్తడంతో పలుచోట్ల లోతట్టు ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి. ముఖ్యంగా మున్నలూరు లంకభూముల్లో మున్నలూరు, మోగులూరు, ఏటూరు గ్రామాల్లో మినుము, కంద, చేమదుంప, ఇతరత్రా పంటలు నీటమునిగాయని, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని సర్పంచ్ కొంగర మురళి పేర్కొన్నారు. గనిఆత్కూరు లంక భూముల్లో కంద, అరటి, పసుపు పంటలు ముంపునకు గురయ్యాయి. లంకల్లో నివాసముంటున్న వారిని పడవల ద్వారా సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చామని పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ మూరకొండ ఏడుకొండలు తెలిపారు. గనిఆత్కూరు గ్రామం మధ్యలో ఉన్న వాగు వంతెనపై రెండఅడుగుల ఎత్తున వరద ప్రవహిస్తున్నది. చెవిటికల్లు గ్రామం వద్ద లక్ష్మయ్య వాగుకు వరద పోటెత్తింది. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక అధికారులు అందుబాటులో ఉంటే తక్షణ చర్యలు తీసుకోవటానికి వీలుపడుతుందని తీరగ్రామాల ప్రజలు చెబుతున్నారు. అయితే ఎక్కువ మంది స్థానిక అధికారులు దుర్గగుడి ఉత్సవాల విధుల్లో ఉన్నారు.



కోతకు గురైన కృష్ణానది తీరం




వరద నీటిలో మినుమ చేను

ముంపు వాకిట లంక గ్రామాలు!


» పులిగడ్డ ఆక్విడెక్ట్‌ను తాకుతూ ప్రవహిస్తున్న కృష్ణానది

» సీతాయిలంక వద్ద పంట పొలాల్లోకి వరద నీరు



పాత ఎడ్లంక వదరదతో కోతకు గురవుతున్న గృహాలు

అవనిగడ్డ: ఎగువన భారీ వర్షాల కారణంగా వరద పోటెత్తడంతో దివి ప్రాంతంలోని కృష్ణా పరివాహక ప్రాంతంలోని లంక గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి 6.40 లక్షల క్యూసెక్కులకుపైగా వరద నీటిని ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేయటంతో వరద నీరు ఆక్విడెక్ట్‌ను తాకుతూ ప్రవహిస్తున్నది. మండల పరిధిలోని సీతాయిలంక వద్ద వరద నీరు పంట పొలాల్లోకి ప్రవేశించిండంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



పులిగడ్డ ఆక్విడెక్ట్‌ను తాకుతున్న వరద నీరు

తీర గ్రామాల ప్రజల్లో ఆందోళన

వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఇప్పటికే కోతకు గురై నదిలో పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్ల గురించి ఎడ్లంక వాసులు ఆందోళన చెందుతున్నారు. నాగాయలంక మండల పరిధిలోని దివి గ్రామాల సమూహమైన ఎదురుమొండి దీవుల్లోని గొల్లమంద సమీపంలో మళ్లీ నదీ కోత మొదలైందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

వన్‌టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బందరురోడ్డులోని ఒక హోటల్ ముందు ఆదివారం వేకువజామున ఆటోలో నుంచి కిందకు దిగుతున్న ప్రకాశం జిల్లాకు చెందిన రాగిపిండి విజయదుర్గ(35)ను వేగంగావచ్చిన కారు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కృష్ణలంక పోలీసుస్టేషన్‌లో ఈమేరకు కేసు నమోదైంది. పామర్రు మండలం మార్కొండపురానికి చెందిన విజయదుర్గ, ఆమె భర్త చిరువ్యాపారం చేసుకుని జీవిస్తున్నారు. ఆమె కుమారుడు తాడిగడపలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. దసరా సెలవులకు కుమారుడ్ని ఊరికి తీసుకువెళదామని గేట్‌వే హోటల్ సమీపంలో బంధువుల ఇంటికి వచ్చారు. అక్కడ ఆటో దిగుతుండగా బెంజిసర్కిల్ వైపునుంచి వేగంగా వచ్చిన కారు ఆమెను ఢీకొనగా అక్కడికక్కడే మృతిచెందింది. ఆటోడ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. కళ్లెదుటే భార్య విగత జీవురాలవడం పట్ల భర్త చంద్రశేఖరరెడ్డి తీవ్ర ఆవేదనకు గురయ్యాడు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242



నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

30 లోపు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

ఉంగుటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈ-క్రాప్ చేయించుకోని రైతులందరూ ఈనెల 30వ తేదీలోపు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏవో గద్దె రమేష్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో వీఏఏల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈక్రాప్ నమోదు ప్రక్రియను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలో ఈ ఏడాది 27వేల ఎకరాల్లో సార్వా వరి సాగులో వుండగా, ఇప్పటివరకు 23,500 ఎకరాల్లో పంట నమోదు ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మిగిలిన 3,500 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదుకు రెండురోజులు మాత్రమే గడువుందని పేర్కొన్నారు. రైతులందరూ త్వరపడి సమీపంలోని గ్రామవ్యవసాయ సహాయకుల (వీఏఏలు)ను కలిసి పంట నమోదు ప్రక్రియ పూర్తిచేయించుకోవాలని సూచించారు.



వీరవల్లి ప్రాజెక్ట్ కామధేనులో దుర్గామాత పూజలో చైర్మన్ చలసాని ఆంజనేయులు దంపతులు

శక్తిస్వరూపిణీ చాముండేశ్వరీదేవి

దసరా శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో 7వ రోజు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు శక్తిస్వరూపిణీగా భక్తులకు దర్శనమిచ్చారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శక్తి స్వరూపిణీ చాముండేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో పాడిరైతు కుటుంబాలు పాడిపంటలు వృద్ధి చెంది సుఖసంతోషాలతో ఉండాలని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వీరవల్లి ప్రాజెక్ట్ కామధేను (పాల ఫ్యాక్టరీ)లో నిర్వ హిస్తున్న దసరా మహోత్సవాల్లో ఆదివారం చలసాని ఆంజనేయులు దంపతులు దుర్గాదేవి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

●మడిచర్లలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేకపూజ నిర్వహించారు. కుంకుమపూజలో మహిళలు పాల్గొన్నారు. రంగన్నగూడెంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో మహిళలు పాల్గొన్నారు. మల్లవల్లిలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో కరేటి అనిల్, శిరీష దంపతులు ప్రత్యే కపూజలో పాల్గొన్నారు. కొత్తపల్లి, బిళ్లనపల్లి, ఓగిరాల తదితర గ్రామాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని చాముండేశ్వరీదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పూజలు

ఉయ్యూరు: శ్రీజగదాంబసమేత సోమేశ్వ రస్వామి ఆలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పూజలు చేశారు. ఆలయ పాలకవర్గ చైర్మన్ నందకిషోర్, సభ్యులు, ఈఓ వీడీడీ ప్రసాద్ ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అర్చకులు ఎమ్మెల్యేతో పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణపై ఆలయ పాలకవర్గ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాల్లో 7వ రోజు ఆదివారం కాటూరు, రాజుపేట, గండిగుంట వంశీ రాయల్ సిటీ ఆవరణలో చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాజుపేటలో ప్రసాదరాజు, శ్యామల దంపతులు, రాయల్ సిటీలో నూకల సాంబశివరావు దంపతులు, కాటూ రులో టీడీపీ నాయకుడు ఎస్ వెంకట నారాయణ దంపతులు పూజలో పాల్గొన్నారు. ఉయ్యూరు శివాలయంలో గాయత్రీదేవి, కాటూరులో రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు.

హనుమాన్‌జంక్షన్: దేవీ నవరాత్రుల్లో భాగంగా స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం రాజరాజేశ్వరిదేవిని ధైర్యలక్ష్మిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఏలూరు రోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీ మాతను, బాపులపాడు శివాలయంలో అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరించారు. వాసవీమాత ఆలయం, శివాలయంలో చండీహోమం నిర్వహించారు. శివా లయంలో దసరా ఉత్సవాలు పురస్కరించుకొని ఆలయ నిర్వాహకులు విజయవాడ అభినయ నాట్య నృత్యాలయం కళాకారులచే భరతనాట్యం ప్రదర్శన ఏర్పాటు చేశారు. కళాకారులు ప్రదర్శించిన నృత్యరూపకం భక్తులను ఆకట్టుకుంది.





కాటూరు రాజుపేటలో.. బాపులపాడు శివాలయంలో చండీహోమం

గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో దసరా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దావాజీగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం అమ్మవారికి పది వేల గాజులతో విశేష అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు రామాచార్యులు ఆధ్వర్యంలో విశేషపూజలు, కుంకుమార్చనలు జరిగాయి. పాత గన్నవరం లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో మహాచండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గాయత్రి మందిరంలో మహాచండీ యాగం జరిపారు.

ప్రసాదంపాడు: రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలు అమ్మవారిని దసరా శరన్నవరాత్రి సందర్భంగా శ్రీ మహాచండీదేవిగా ఆదివారం అలకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుని తీర్థప్రసాదాలు స్వీకరించారని ఈవో ప్రియాంక తెలిపారు. తన్మయి బృందంచే ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆహుతులను అలరించిందని తెలిపారు.

కానూరు: కానూరులోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగం గా ఆదివారం పార్వతీ అమ్మవారు సంతాన లక్ష్మీదేవిగా అలంకృతులై భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు, సహస్ర కుంకుమర్చన నిర్వహించారు. ఆలయపూజారులు ఫణి, కృష్ణఫణిలు పూజా క్రతువులు చేసి భక్తులకు ప్రసాదం అందజేశారు.

రామలింగేశ్వరనగర్ : దసరా శరన్నవరాత్రి ఉత్సవములు దేవిభక్త బృందం ఆధ్వర్యంలో నిర్వాహకులు వీరంకి మోహన్‌రావు, చిట్టిబొమ్మ బాలగంగాధర రావు, మొర్ల సుబ్బారావులు ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారు శనివారం శ్రీవారాహిమాత అవతారంలో దర్శనమిచ్చారు. పటమట ఎన్ఎస్ఎమ్ స్కూలు పక్కన కౌండిన్య నగర్ నందు ఉభయ దాతలు చిట్టిబొమ్మ సాంబశివరావు జయ లక్ష్మీ, మరీదు రాజశేఖర్ శివపార్వతి దంపతుల చేతుల మీదుగా పూజా కార్యక్రమం నిర్వహించారు.



గుర్రం జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రవిబాబు, నాగరాజు

నవయుగ వైతాళికుడు జాషువా

గన్నవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నవయుగ వైతాళికుడు గుర్రం జాషువా నేటి యువతకు ఆదర్శమని రోటరీక్లబ్ ఆఫ్ గన్నవరం అధ్యక్షుడు జీవి రవిబాబు అన్నారు. స్థానిక గ్రేడ్-1 గ్రంథాలయంలో ఆదివారం కవి చక్రవర్తి గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ, తన జీవితాంతం పేద, బడుగు బలహీన వర్గాల కోసం పాటుపడ్డారన్నారు. తన కవితల ద్వారా ఆర్థిక అసమానతలను రూపు మాపేందుకు కృషి చేశారన్నారు. గబ్బిలం లాంటి కవితల ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చారని తెలిపారు. గ్రంథాలయ అధికారి కె.నాగరాజు పాల్గొన్నారు.



మహనీయుడు భగత్‌సింగ్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల వయస్సులోనే ప్రాణత్యాగం చేసి ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదాన్ని పరిచయం చేసిన మహనీయుడు భగత్‌సింగ్ అని గ్రామ ప్రముఖుడు కుటుంబరావు తెలిపారు. కానుమోలులో రాణా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌సింగ్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత అభివృద్ధి పథంలో ముందుకుసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్, రహీం, తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో వృద్ధుల పాత్ర కీలకం: ఎమ్మెల్యే బోడె

పెనమలూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సమాజ నిర్మాణంలో వృద్ధుల పాత్ర కీలకమయినదని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఆదివారం పోరంకి బీజేఆర్‌నగర్‌లోని చర్చిలో వృద్ధుల దినోత్సవాన్ని టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, వృద్ధులు తమ జీవితంలో ఎదుర్కొన్న సమస్యలు, అనుభవాలు, జీవిత పాఠాలను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు నడవాలని పేర్కొన్నారు. జీవితంలో యువతకు సమస్యల నివారణకు తగు సూచనలివ్వాలని వృద్ధులను కోరారు. షుమారు వంద మందికి దుస్తులు, చీరెలు, పండ్లు బహూకరించి వారిని సన్మానించారు. కార్యక్రమంలో చెన్నుపాటి శ్రీనివాసరావు, సిరిగిరి మధు, పరిమి యేసోబు, వేమూరి ప్రసాద్, బొంగరాల అబ్రహాం పాల్గొన్నారు.

మంగినపూడి బీచ్‌లో మునిగిపోయిన యువకుడు

● కాపాడిన పోలీసులు ●ఆసుపత్రికి తరలింపు

మచిలీపట్నం క్రైమ్, సెప్టెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): ప్రమాదవశాత్తు యువకుడు సముద్రంలో మునిగిపోయిన ఘటన మచిలీపట్నం రూరల్ మంగినపూడి బీచ్‌లో చోటు చేసుకుంది. మెరైన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్నవరంలో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసే హరిప్రీత్‌సింగ్ తన స్నేహితులతో కలసి ఆదివారం బీచ్‌కు వచ్చాడు. బీచ్‌లో ఎవరి మాటా వినకుండా సముద్రం లోపలికి స్నేహితులతో కలిసి వెళ్లాడు. హరిప్రీత్‌సింగ్ అతని స్నేహితులు ప్రమాదం బారిన పడుతున్నారని గ్రహించిన మెరైన్ పోలీసులు వారిని కాపాడారు. హరిప్రీత్ సింగ్‌తో పాటు మరో ఇద్దరు యువకులను పోలీసులు ఒడ్డుకు తీసుకువచ్చారు. హరిప్రీత్ సింగ్‌కు ప్రథమ చికిత్స నిర్వహించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించటంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ ఆసుపత్రికి తరలించారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ప్రాధాన్యం
- ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్
- వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

పెనమలూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అత్యంత శ్రద్ధపెట్టి కాపాడుకోవాలని ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్‌లు అన్నారు. వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా ఆదివారం కామినేని ఆసుపత్రి నిర్వహించిన అవగాహన ర్యాలీని ఎమ్మెల్యేలు ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, ఆధునిక జీవన విధానాల వల్ల ప్రస్తుతం ప్రజలు చిన్న వయసులోనే అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకొంటూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, వ్యాయామం చేయడం, మంచి జీవన శైలిని అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అవగాహన ర్యాలీ నిర్వహించిన ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్ ఎస్ఆర్ఎస్ వర్ధన్, టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వైద్యులు డాక్టర్ కళ్యాణ్ వెంకటేశ్వర్లు, డాక్టర్ అర్చన, డాక్టర్ భరత్, డాక్టర్ సురేష్, పీ సునీల్, రమణారావు తదితరులు పాల్గొన్నారు.



కామినేని ఆసుపత్రి నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్

●వణుకూరుకు చెందిన రెంటపల్లి రమేశ్‌బాబుకు సీఎం సహాయనిధి నుంచి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ రూ. 2 లక్షల ఎల్వోసీ చెక్కు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

● వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు నోచుకోని పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. యనమలకుదురు లిఖ్రా కాలనీలో రూ. 34 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామాలలో సీసీ రోడ్లు నిర్మాణం చే పట్టామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులను ఈ సందర్భంగా వివరించారు.

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వ ప్రోత్సాహం

కానూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం-2025 (ఎల్ఆర్ఎస్) ద్వారా అనధికార లేఅవుట్ దారులకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు కల్పిస్తుందని తాడిగడప మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జూన్ 30వ తేదీ నాటికి రిజిస్టర్ అయిన అనధికార లేఅవుట్‌లు, ప్లాట్‌ల క్రమబద్ధీరణకు ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందన్నారు. అక్టోబరు 20వ తేదీ నాటికి నిబంధనల ప్రకారం రుసుం చెల్లించాలని ఆయన కోరారు. ఈ పథకం ద్వారా నిబంధలనకు అనుగుణంగా చట్టబద్ధమైన భవననిర్మాణ అనుమతులు, విద్యుత్, నీటి సరఫరా, డ్రెయినేజీ, సీవరేజి కనెక్షన్‌ల వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

జీఎస్‌టీ- 2.0పై ప్రజల్లో అవగాహన

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్‌టీ- 2.0పై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తారని మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సూపర్ జీఎస్‌టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా ప్రజలకు ఉపయోగపడే నిత్యావసర వస్తువులపై జీఎస్‌టీని వివరిస్తారని పేర్కొన్నారు. దీనివల్ల జీఎస్‌టీ సంస్కరణలతో మహిళా సాధికారత సాధించవచ్చని ఆయన తెలిపారు.



బొమ్ములూరులో భవానీలకు భక్తిపుస్తకాలు అందజేస్తున్న మాజీ మంత్రి మాగంటి బాబు, దంపతులతో పుట్టగుంట సతీష్‌కుమార్

భవానీలకు సేవలు అభినందనీయం

మాజీ మంత్రి మాగంటి బాబు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వ్యయప్రయాస కోర్చి దూర ప్రాంతాల నుంచి విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి కాలినడక వచ్చే భక్తులకు 17 ఏళ్లుగా పుట్టగుంట సతీష్‌కుమార్ అందిస్తున్న సేవలు అభినందనీయమని మాజీ మంత్రి మాగంటి బాబు అన్నారు. బొమ్ములూరు ఫ్యాక్టరీలో వీహెచ్‌పీ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా శిబిరాన్ని ఆదివారం కుటుంబసభ్యులతో కలిసి సందర్శించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భవానీలకు పుస్తక ప్రసాదాలను (భక్తిపుస్తకాలు) పంపిణీ చేశారు. తదనంతరం పుట్టగుంటతో కలిసి అన్నప్రసాద వితరణలో పాల్గొని భవానీ లకు సేవలందించారు. కాలినడక వచ్చే భవానీలకు వైద్య శిబిరంతో పాటు విశ్రాంతికి వసతి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నందిగం స్వామి, యలమంచిలి మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



డ్రిల్‌లో ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ జీసీ పాండే

ఉయ్యూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశభక్తి గల పౌరులుగా ఎదిగేందుకు ఎన్‌సీసీ ఎంతో ఉపయోగ పడుతుందని కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ జీసీ పాండే అన్నారు. 17వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ ఆర్మీవింగ్ వార్షిక శిక్షణ-2లో భాగంగా శ్రీవిశ్వశాంతి స్కూల్ ఆవరణలో జరుగుతున్న ఎన్‌సీసీ కేడెట్ల శిక్షణ కార్యక్రమానికి ఆదివారం ఆయన హాజరై మిలటరీ సంబంధింత పలు అంశాలపై ఎన్‌సీసీ కేడెట్లకు అవగాహన కల్పించారు. మూడు జిల్లాలకు చెందిన వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 619 మంది కేడెట్లు పాల్గొనగా ఫైరింగ్, మ్యాప్‌రీడింగ్, డ్రిల్, ఫీల్డ్‌క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్, సైబర్ సెక్యూరిటీ, ఫైర్ ఫైటింగ్, ప్రకృతి వైపరీత్యాలపై ఎన్‌డీఆర్ఎఫ్‌చే అవగాహన కల్పించారు. డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ అజిత్ సింగ్‌తోమర్, క్యాంప్ ఎడ్జుడెంట్ కెప్టెన్ నవీన్‌కుమార్, వివిధ కళాశాలల ఎన్‌సీసీ ఆఫీసర్లు, ఆర్మీ పీఎం స్టాఫ్, సివిలియన్ స్టాఫ్ పాల్గొన్నారు.

వెలగపూడి శంకరబాబుకు అభినందనల వెల్లువ

కానూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యులుగా నియమితులైన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబును ఆదివారం పలువురు అభిమా నులు అభినందించారు. కానూరులోని ఆయన స్వగృహానికి అభిమానులు మొక్కపాటి శ్రీనివాసరావు, అన్నపూర్ణ, విజయలక్ష్మి, రామలింగేశ్వరరావు, కొండ సుబ్బారావు, శేఖర్, ఉమామహేశ్వరరావు తదితరులు వెళ్లి శంకరావు దంపతులను పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. స్వీట్‌లను పంపిణీ చేశారు.



శంకరబాబు దంపతులను అభినందిస్తున్న అభిమానులు



సంగీత ఝరి.. నృత్య మయూరి



● విజయవాడ ఉత్సవ్‌లో ఉర్రూతలూగించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఆంధ్రజ్యోతి, విజయవాడ కల్చరల్: సంగీత ఝరి.. నృత్య ఝుడితో విజయవాడ ఉత్సవ్‌కు వచ్చిన ప్రేక్షకులు ఆనందసాగరంలో మునిగి తేలుతున్నారు. విజయవాడ ఉత్సవ్ 7వ రోజున కూచిపూడి నృత్య ప్రదర్శనలు, సంప్రదాయ సంగీత ప్రదర్శనలు, కళాకారుల నృత్యాలు, మిమిక్రీ, మ్యాజిక్ షో, హాస్యరసపు నాటికలు, పౌరాణిక నాటకాలు ఇలా.. నవరసాల పరవళింపుల గుభాళింపులతో తేలియాడారు.

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో..

విజయవాడకు చెందిన విష్ణుబట్ల సంగీత కచేరీ సంగీతకృతులతో సభను హోరెత్తించింది. ఈ బృందం వినాయకుడి కీర్తన గిరిరాజపుత్ర కీర్తనతో ప్రారంభించి త్యాగరాజ స్వామి అర్చించిన కృతి సామజవరగమన, గరుడ గమన పాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. కోనసీమకు చెందిన పీ వీరబాబు ప్రదర్శించిన వీరనాట్య ప్రదర్శన సందర్శకులను ఆహ్లాదపరిచింది. అయాచితుల ఫౌండేషన్ బృందం ప్రదర్శించిన పెళ్లిచూపుల నాటిక హాస్యాన్ని పండించింది. పెద్దాపురానికి చెందిన వనపర్తి కోటేశ్వరరావు తోలుబొమ్మలాట రామాయణ ఇతివృత్తంపై చేసిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నగరానికి చెందిన వెంకట్ మ్యాజిక్ షో వీక్షకులను అబ్బురపరిచింది. హైదరాబాద్‌కు చెందిన స్నేహలతా బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యోత్సవాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలకు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఏపీ రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ చైర్మన్ తేజస్వి పొడపాటి, ఏపీ నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ గద్దె అనురాధ విచ్చేశారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో అద్భుత ప్రదర్శనలిచ్చిన వారిని ఎంపీ కేశినేని చిన్ని ఘనంగా సత్కరించారు.

ఘంటసాల సంగీత కళాశాలలో..

విజయవాడకు చెందిన యామిని, మోహన, బాలశ్రీ కలిసి ప్రదర్శించిన కూచిపూడి నృత్యం కన్నుల పండువగా సాగింది. కూచిపూడి నృత్య ప్రదర్శనలో పల్లవి, చంద్రిక, వర్షిణి పాల్గొన్నారు. విజయవాడకు చెందిన జీవీఆర్ సంగీత కళాశాల విద్యార్థులతో సంగీత కచేరీ కన్నుల పండువగా సాగింది. గాత్రం సీ లాస్యప్రియ, ప్రణాదలు అందించగా మృదంగం ఇందు వర్ధన్, వయోలిన్ మనసిజ సహకారం అందించారు. గుంటూరుకు చెదిన శివకుమార్ మిమిక్రీషో ప్రజలకు కళలపై మక్కువ తెచ్చింది.

ఇంద్రకీలాద్రి వేదికపై..

దసరా ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రిపై అమ్మవారు మహా చండీదేవి అలంకారంలో దర్శనమిస్తుండగా ఆదివారం కొండ దిగువున కనకదుర్గానగర్‌లో దేవస్థానం ఏర్పాటు చేసిన కళా వేదికపై సంగీతం, నృత్యం వంటి లలిత కళలు ప్రదర్శన జరుగుతుంది. నగరానికి చెందిన ఎస్ ప్రసాద్ మృదంగ లయ విన్యాసం, బుర్రా నీలకంఠ శాస్త్రి భక్తి సంగీతం, రామచంద్రాపురానికి చెందిన వై శిఖామణి గానం చేసిన పార్వతీ కల్యాణం హరికథ, విజయవాడకు చెందిన ఆనంద్, ఫణీంద్ర కుమార్, కే శ్రీనివాస్ బృందాల కూచిపూడి నృత్యాలు భక్తులను ఆధ్యాత్మిక పారవశ్యంలో నడిపించాయి. శ్రీ కాళహస్తికు చెందిన మోహన్ తరుణీ, కంకిపాడుకు చెందిన అరుణ కల్యాణి నృత్యాలు, నగరానికి చెందిన రేవతి, రోహిణి బృందాల కోలాట ప్రదర్శనలు అలరించాయి.

పవిత్ర సంగమంలో..

పాడుతా తీయగా ఫేమ్ రసూల్ బాబు బృందం సినీ, భక్తి సంగీత విభావరి అలరించింది. లక్ష్మణ్ నాయక్, మల్లేశ్వరి, లక్ష్మీ తులసి శ్రావ్యంగా గానం చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఉషా మాధవి బృందం నగరానికి చెందిన శైలజ శ్రీ బృందం ప్రదర్శించిన కూచిపూడి, జానపదం నృత్యంశాలు, ఆకట్టుకున్నాయి. ముందుగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. విజేతలకు కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చిట్టి బాబు కమిషనర్ రమ్య కీర్తన బహుమతులు ప్రదానం చేశారు.

- ● అలరించిన రామ్ మిర్యాల టీమ్
- ● ఆకట్టుకున్న వీరబాబు వీరనాట్యం, శివకుమార్ మిమిక్రీ, వెంకట్ మ్యాజిక్ షో
- ● హాస్యపు విరిజల్లుల్లో ఓలలాడిన ఆహూతులు



రామ్ మిర్యాల రచ్చ

ఇబ్రహీంపట్నం: రామ్ మిరియాల లైవ్ మ్యూజిక్ కన్సర్ట్ గొల్లపూడి ఎగ్జిబిషన్‌లో ఆదివారం యువతను ఉర్రుతలూగించింది. యువతి, యువకులు, ఆడియన్స్ కుర్చీలు వదిలి స్టేజ్ వద్దకు చేరుకొని సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు. సుమారు గంటన్నర పాటు సాగిన రామ్ మిరియాల షో ప్రేక్షకులను కట్టి పడేసింది. కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం గరికపర్రుకు చెందిన రాజీవ్ బ్రదర్స్ వారు చేసిన డప్పు అండ్ డాన్స్ షో గొల్లపూడి ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజయవాడ ఎక్స్‌పో (గొల్లపూడి ఎగ్జిబిషన్)కు యాంకర్‌గా వ్యవహరించిన రేణుక రామ్ మిర్యాల షో ప్రారంభానికి ముందు అల్లరి అల్లరి చేసింది. స్టేజ్ వదిలి ఆడియన్స్ గ్యాలరీలోకి వచ్చి యువతతో పాటలు పాడించారు. ఎగ్జిబిషన్‌కు వచ్చిన ఆడియన్స్, భక్తులకు మంచి రుచికరమైన ఆహారాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్‌కు మంచి ఆదరణ లభించింది. టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి.. రామ్ మిరియాల షోను ఎంజాయ్ చేశారు. ఆమె పక్కనే జడ్పీ మాజీ చైర్ పర్సన్ గద్దె అనురాధ కూర్చొని షోను ఎంజాయ్ చేశారు.

అపూర్వ కళా వైభవం..

డీఆర్‌డీవో శాస్త్రవేత్త సతీష్ రెడ్డి

విజయవాడ సిటీ: మరిచిపోయిన ఎన్నో మన కళాఖండాలను విజయవాడ ఉత్సవ్ నేటితరానికి పరిచయం చేస్తూ యువతను మైమరిపిస్తోందని డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) శాస్త్రవేత్త సతీశ్ రెడ్డి ప్రశంసించారు. పున్నమి ఘాట్ లో జరుగుతున్న విజయవాడ ఉత్సవ్ ఆదివారం ఏడవ రోజుకు చేరుకుంది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. 11 రోజులు పాటు 5 ప్రాంతాల్లో వివిధ కళారూపాలను నేటితరం కళ్ల ముందు ఇస్తున్న తీరు ప్రశంసనీయమన్నారు. సినీ ఆధ్యాత్మిక గీతాలు, సినిమా పాటలతో సినీ సంగిత దర్శకుడు సాకేత్, ప్రణతి బృందం ప్రేక్షకులను అలరించారు. ఈ పాటలకు వేదిక కింద యువత స్టెప్పులతో హోరెత్తించారు. సత్య మాస్టర్ బృందం చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



విజయవాడ ఉత్సవ్‌లో నేటి ప్రదర్శనలు

విజయవాడ: విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా 8వ రోజు సెప్టెంబర్ 29న సోమవారం నగరంలోని విజయవాడ ఉత్సవ్ వేదికల్లో జరిగే ప్రదర్శనలు సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమవుతాయి.

గొల్లపూడి ఎగ్జిబిషన్‌లో

సాంస్కృతిక ప్రదర్శనలు, మెలోడి బ్రహ్మ మణిశర్మ లైవ్ మ్యూజిక్ కన్సర్ట్. భవానీపురం పున్నమి ఘాట్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు, చామేలెన్స్ స్వాప్ ది బీట్ లైవ్ కన్సర్ట్, దాండియా డీజే.

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో

శ్రీ లలిత ఐశ్వర్యాంబికా నృత్య కళాక్షేత్రం శిష్య బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన, సంగీత కచేరీ ప్రదర్శన, విజయవాడకు చెందిన రాజీవ్ సోదరులతో డప్పుల ప్రదర్శన, కాకినాడకు చెందిన తోట అన్నవరం బృందంతో తోలుబొమ్మలాట, టీజీవీ కళాక్షేత్రం, కర్నూలు వారి పౌరాణిక పద్య నాటకం జగదేకసుందరి సామా.

ఘంటసాల ప్రభుత్వ కళాశాలలో

విజయవాడకు చెందిన కావ్య శిష్య బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన, సంగీత కచేరీ ప్రదర్శన, శ్రీకాకుళంకు చెందిన శెట్టి రాజు బృందంతో తప్పెట గుళ్ల ప్రదర్శన, కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన గొర్రెల రాము బృందంతో బుర్రకథ, ఆరాధన ఆర్ట్స్, గుంటూరు వారి సాంఘిక నాటికం పాప దొరికింది వంటి ప్రదర్శనలు జరుగుతాయి.

సమసమాజ నిర్మాణ స్ఫూర్తి ప్రదాత గుర్రం జాషువా

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్

కలెక్టరేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కలాన్ని ఆయుధంగా వాడుకొని సమాజంలోని రుగ్మతలను రూపుమాపిన వ్యక్తి మహాకవి గుర్రం జాషువా అని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. ఆదివారం ఎన్టీఆర్ కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏపీ భాషా సాంస్కృతిక శాఖ అధ్వర్యంలో నిర్వహించిన పద్మభూషణ్ గుర్రం జాషువా 130వ జయంతి వేడుకల్లో మంత్రి కందుల దుర్గేశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ తొలుత ఈ వేడుకలను మంత్రి దుర్గేశ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నవయుగ కవి చక్రవర్తి జాషువా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్యం కోసం కృషి చేస్తున్న డాక్టర్ కనకదుర్గప్రసాద్ రావు, డాక్టర్ పాలపర్తి శ్రీధర్, మీసాల లక్ష్మణ్, పొట్లూరి హరికృష్ణ, కే గురువమ్మకు కవికోకిల పద్మభూషణ్ గుర్రం జాషువా 2025 పేరిట ఒక్కొక్కరికి రూ.50వేల నగదు పురస్కారాలను మంత్రి దుర్గేశ్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. తొలుత సమావేశ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గుర్రం జాషువా చిత్రమాలికను మంత్రి దుర్గేశ్ పరిశీలించారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు రచించిన విశ్వనరుడు పుస్తకాన్ని, కళారత్న డాక్టర్ పాలపర్తి శ్రీధర్ రచించిన ముక్తామణి పద్యశతకం పుస్తకాన్ని మంత్రి కందుల దుర్గేశ్ ఆవిష్కరించారు. అలాగే డిసెంబరు 27, 28న జరిగే ప్రపంచ తెలుగు కవుల మహాసభల పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు.



మాట్లాడుతున్న మంత్రి దుర్గేశ్

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని తన పాండిత్యంతో పరవశింపజేసిన మహోన్నత వ్యక్తి గుర్రం జాషువా అన్నారు. అలాంటి విశ్వనరుడు పద్మభూషణ్ గుర్రం జాషువా 130వ జయంతి వేడుకల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. గుర్రం జాషువా నడయాడిన శాసనమండలి నుంచే తన రాజకీయ జీవితం ప్రారంభమైందని మంత్రి గుర్తుచేసుకొన్నారు. భావితరాలకు ఆయన భావజాలాన్ని ముందకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సాంస్కృతిక, సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ గొప్ప కవి గురించి ఈ తరానికి తెలియకపోవడం బాధాకరమన్నారు. సామాజిక రుగ్మతలను కలంతో రూపుమాపిన వ్యక్తి గుర్రం జాషువా అని కొనియాడారు. నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ సామాన్య మనుషులకు సైతం అర్థమయ్యే రీతిలో రచనలు చేసిన వ్యక్తి జాషువా అన్నారు. పురస్కార గ్రహీతలు కవికోకిల గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆయన ప్రస్థానాన్ని, కవిత్వాన్ని, సాహిత్య పాండిత్యాన్ని తమదైన శైలిలో వివరించారు. సాంస్కృతిక, సృజనాత్మక సమితి డైరెక్టర్ రేగుళ్ల మల్లికార్జునరావు, కలెక్టర్ లక్ష్మీశ, సాంస్కృతిక శాఖ అధికారులు సుమన్, శ్రీనివాస్, ప్రముఖ రంగస్థల, సినీ నటుడు మీసాల లక్ష్మణ్, నంది అవార్డు గ్రహీత డాక్టర్ కనకదుర్గా ప్రసాదరావు, కత్తి గురువమ్మ, డాక్టర్ శ్రీధర్, జానపద కళల అకాడమీ మాజీ చైర్మన్ పొట్లూరి హరికృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ పూర్వ ముఖ్య కార్యదర్శి పీవీ రమేష్

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి

● రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

గవర్నర్‌పేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరమైన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీపీపీ విధానాన్ని (పబ్లిక్ ప్రైవేట్ పార్టిసిపేషన్) మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పూర్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ పీవీ రమేష్ కోరారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అధ్యక్షతన ప్రజారోగ్య వేదిక, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఆరోగ్యమనేది ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా ఆరోగ్య హక్కు చట్టాన్ని తేవాలని, అభివృద్ధి చెందిన దేశాల్లోనూ వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ప్రజారోగ్యంపై పెట్టే ఖర్చులను భవిష్యత్తు కోసం పెట్టే ఖర్చుగా భావించాలన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఎక్కువ ప్రైవేట్ కళాశాలలు మనదేశంలోనే ఉన్నాయని, ప్రైవేట్ వైద్యం వ్యాపార దృక్పథంతోనే నడుస్తోందని ఆరోపించారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణయ్య మాట్లాడుతూ పీపీపీ పద్ధతిలో జరిగే వైద్య కళాశాల ప్రైవేటీకరణతో ఆ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రుల్లో పేద ప్రజలకు వైద్యం ఉచితంగా అందదన్నారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ నియో లిబరలైజేషన్ ప్రపంచ వ్యాప్తంగా అంతిమ దశకు వచ్చిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం దాన్నే పట్టుకుని వేలాడుతున్నారన్నారు. సామాజిక కార్యకర్త కుర్రా వసుంధర మాట్లాడుతూ ప్రమాదకరమైన పీపీపీ విధానంపై న్యాయపోరాటం చేయాలన్నారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి టీ కామేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, వివిధ సంఘాల నేతలు ఐషె గోష్, జీ విజయ్, మాధవరావు, మాల్యాద్రి, వైద్యులు డాక్టర్ వీ రవీంద్ర, సురేష్‌చంద్రా రెడ్డి, సుమ పాల్గొన్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం

మచిలీపట్నం క్రైమ్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ అనుచరులు ఇంటిపై దాడికి యత్నించటంతో మనస్తాపం చెందిన మహిళ ఆత్మహత్యకు యత్నించిన ఘటన మచిలీపట్నం రూరల్ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదయాదర పంచాయతీ పరిధిలో అక్రమంగా మట్టితవ్వకాలు జరిగాయని టీడీపీకి చెందిన నరసింహారావు గతంలో కలెక్టర్ సహా అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఫలితం లేకపోకపోవటంతో కోర్టును ఆశ్రయించాడు. కోర్టు మట్టి తవ్వకాలపై విచారణ చేయాలని అధికారులను ఆదేశించటంతో గ్రామ ఉప సర్పంచ్ శేషాద్రితో పాటు వాసు, పవన్, గళ్ల లక్ష్మణ్, కంచర్లపల్లి కోదండ రామారావు.. నరసింహారావు ఇంటిపై దాడికి యత్నించి కుటుంబ సభ్యులను దుర్భాషలాడారు. దీంతో మనస్తాపానికి గురైన నరసింహారావు భార్య సత్యవతి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు ఆమెను మచిలీపట్నం సర్వజనాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మచిలీపట్నం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ప్రపంచదేశాల్లో యోగాకు ప్రత్యేక గుర్తింపు

● జాతీయ యోగాసన పోటీల ప్రారంభోత్సవంలో ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు, ఎంపీ కేశినేని

మొగల్రాజపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచదేశాల్లో భారతీయ యోగాకు ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఘనత మన ప్రధాని నరేంద్ర మోదీ అని ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు కొనియడారు. పీబీ సిద్ధార్థ ఇండోర్ స్టేడియంలో జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న 6వ జాతీయ జూనియర్ సీనియర్ యోగాసన చాంపియన్ షిప్ పోటీల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా అనేది మనస్సుకు శరీరానికి సంబంధించిందన్నారు. మానసిక ఆరోగ్యానికి, శారీరక ఆరోగ్యానికి ప్రతి ఒక్కరు యోగా సాధన చేయాలన్నారు. విశిష్ట అతిథి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ యోగాసన పోటీలకు విజయవాడ వేదికవడం గర్వకారణమన్నారు. యోగా దినోత్సవం మన రాష్ట్రంలో విశాఖలో జరగడం గిన్నిస్ రికార్డు సాధించడం గుర్తు చేశారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ భారతీయ జీవన విధానంలో యోగా ఒక అద్భుతమని అందుకే ప్రపంచ దేశాలన్నీ నేడు యోగాను అనుసరిస్తున్నాయన్నారు. యోగా పోటీలకు దేశవ్యాప్తంగా వలు రాష్ట్రాల నుంచి 1,500 మంది వచ్చారని యోగాసన రాష్ట్ర సంఘం గౌరవాధ్యక్షులు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ చెప్పారు. అతిథులు క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ పోటీలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం అధ్యక్షురాలు ఏ రాధిక, కార్యదర్శి పీ ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎం రాజశేఖర్ రెడ్డి, యోగాసన భారత్ స్పోర్ట్స్ కన్సల్టెంట్ శ్రేయాస్ మార్కండేయ, ఎన్టీయార్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ సంఘం అధ్యక్షుడు కొంగర సాయి పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి ముఖ్యమంత్రి పట్టువస్త్రాల సమర్పణ

(5వ పేజీ తరువాయి)

వీఐపీలు ఉంటారని చెప్పారు. ఈవో శీనానాయక్ మాట్లాడుతూ సోమవారం మూడున్నర నుంచి నాలుగున్నర గంటల మధ్య సీఎం చంద్రబాబు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని తెలిపారు. కుంకుమార్చన, శ్రీచక్రనవావరణార్చన చేయించుకునే భక్తులకు భవానీ ఘాట్, గాంధీ మ్యూజియం నుంచి ఏర్పాటు చేసిన వాహనాలలో రావాలని, మిగతా ఏ వాహనాలను అనుమతించడం లేదన్నారు

ఆనంద ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించారని తెలిపారు. చంద్రబాబు ఆలోచనలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బాజపా సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ కనకదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులతో చేపట్టిన విజయవాడ ఉత్సవ్ అంగరంగ వైభవంగా జరుగుతోందన్నారు. ప్రభుత్వ సహకారంతో విజయవాడ ఉత్సవ్‌ను ప్రతి ఏటా నిర్వహిస్తామని చెప్పారు. ప్రముఖ శాస్త్రవేత్త, డిఫెన్స్ ఎండ్ సైన్స్ ప్రభుత్వ సలహాదారుడు సతీష్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో విజయవాడ పరిసర ప్రాంతాల్లో డిఫెన్స్‌కు సంబంధించి పెద్ద ఎత్తున పరిశ్రమ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ యనమలకుదురు శివాలయం సమీపంలో భవాని ద్వీపం తరహాలో శివానీ ద్వీపంగా అభివృద్ధి చేస్తే నగరానికి మంచి ఆకర్షణగా ఉంటుందన్నారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, తుని ఎమ్మెల్యే యనమల దివ్య మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్ వంటి ఎన్నో కార్యక్రమాలు భవిష్యత్తులోనూ చేపట్టాలన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి ప్రసంగించారు.

కృష్ణమ్మ పరవళ్లు

(5వ పేజీ తరువాయి)

మండలం నడకుదురు తదితర గ్రామాల పరిధిలోని కరకట్ట వెంబడి ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాల్లోని నీరు చేరింది. పసుపు, కంద తోటలు మునిగాయి. సోమవారం ఉదయం నాటికి కృష్ణానదిలో నీటి ప్రవాహం మరో అడుగు మేర పెరిగే అవకాశం ఉందని అధికారులు, స్థానిక రైతులు చెబుతున్నారు. వరద ఉధృతి కారణంగా నాగాయలంక మండలంలోని ఎదురుమొండి తదితర గ్రామాల వద్ద కృష్ణానది ప్రమాదకరస్థితిలో పొంగి ప్రవహిస్తోంది. అవనిగడ్డ సమీపంలో కృష్ణానదిలో ఉన్న యడ్లంక గ్రామం వరద నీటి ఉధృతి కారణంగా కోతకు గురవుతోంది. గృహాల పక్క నుంచి వరద ప్రవహిస్తుండంతో పాటు భూమి కోతకు గురవుతుండటంతో ఇళ్లు కొట్టుకుపోతాయనే భయం స్థానికులను వెంటాడుతోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి ఈ నెల 24వ తేదీ నుంచి సముద్రంలోకి 3.19 లక్షల క్యూసెక్కుల నుంచి 4.50 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. కృష్ణానదికి ఉపనదులుగా ఉన్న మూసీ, వజినేరు, మునేరులతోపాటు నాగార్జున సాగర్ నుంచి వరదనీటిని వదులుతుండటంతో రానున్న రెండు, మూడు రోజులపాటు వరద ఉధృతి మరింతగా కొనసాగుతుందని జలవనరులశాఖ అధికారుల అంచనా వేస్తున్నారు. దీంతో కృష్ణానది పరివాహక ప్రాంతంలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. వరద ఉధృతి పెరుగుతుండటంతో ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో నెంబరు ప్రమాదహెచ్చరిక జారీ చేసినట్టు అధికారులు చెబుతున్నారు.

అవనిగడ్డలో డయేరియా కలకలం

(5వ పేజీ తరువాయి)

అల్పాహారం తిన్నట్లుగా చెబుతున్నారని, వారి పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని అవనిగడ్డ ఏరియా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సుమంత్ తెలిపారు. డయేరియా లక్షణాలు కనిపించిన ప్రాంతం వేకనూరు పీహెచ్‌సీ పరిధిలో ఉంది. 3 రోజులుగా పీహెచ్‌సీ సిబ్బంది ఎవరు ఆ ప్రాంతాన్ని సందర్శించి ప్రజలను అప్రమత్తం చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. 3రోజుల క్రితం పంచాయతీ సిబ్బంది వచ్చి సున్నం చల్లి వెళ్లిపోయారని చెబుతున్నారు. ఈ విషయమై వేకనూరు పీహెచ్‌సీ వైద్యాధికారిని వివరణ కోరగా, తమ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. ఆప్రాంతంలో పారిశుధ్య చర్యలు ప్రారంభించామని, అవసరాన్ని బట్టి 7, 8 వార్డుల్లో ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేస్తామని వివరించారు.

అద్దె భవనాలే దిక్కు!

(5వ పేజీ తరువాయి)

నడుపుతున్నారు. వీటికి నూతన భవనాలు నిర్మాణం చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎన్టీఆర్ జిల్లా కృష్ణాజిల్లా నుంచి వేరుపడినట్లుగా చూపి, కృష్ణాజిల్లాను పాతజిల్లాగా పరిగణిస్తున్నారు. ఆయా కార్యాలయాల భవనాల నిర్మాణానికి ఇంతవరకు నిధులు కేటాయించలేదు.

నిలిచిన తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయ భవనాల నిర్మాణం

మచిలీపట్నంలోని తహసీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్ ప్రాంగణంలోని మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయం బ్రిటిష్ వారి కాలంలో నిర్మించినవి కావడంతో శిథిలావస్థకు చేరాయి. ఈ కార్యాలయాలు పల్లపు ప్రాంతంలో ఉండటంతో భారీ వర్షాలు కురిసిన సమయంలో వర్షపు నీరు కార్యాలయాల్లోకి ప్రవేశించి కార్యకలాపాలకు కొంతమేర అడ్డంకులు ఎదురవుతున్నాయి. దీంతో 2018, సెప్టెంబరు 28వ తేదీన ఈ రెండు కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. పునాదులదశ వరకు నిర్మించారు. ఆ తర్వాత 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ఈ రెండు కార్యాలయ భవనాల నిర్మాణాన్ని వివిధ కారణాలతో నిలిపివేశారు. రెండేళ్ల క్రితం మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయాన్ని నార్త్, సౌత్ మండలాలుగా విభజించారు. నార్త్‌మండల కార్యాలయం పాత భవనంలో కొనసాగుతుండగా, సౌత్‌మండల కార్యాలయాన్ని జలవనరులశాఖ అతిథి గృహంలో నడుపుతున్నారు.

చల్లగా చూడమ్మా.. మహాచండికా..

(5వ పేజీ తరువాయి)

ఏడాది ఉత్పన్నమైన పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తిరుమల తరహా కంపార్టుమెంట్ల విధానాన్ని అమలు చేశారు. భక్తులు భారీ సంఖ్యలో వస్తే వారిని నియంత్రించడానికి వీఎంసీ ఎదురుగా, వీఎంసీ వెనుక వైపున తాత్కాలికంగా కంపార్టుమెంట్లను ఏర్పాటు చేయించారు. ప్రతి కంపార్టుమెంట్‌కు చుట్టుపక్కల బారికేడ్లు ఏర్పాటు చేశారు. వినాయకుడి ఆలయం నుంచి ఇంద్రకీలాద్రిపై వరకు 1.08 కిలోమీటర్లు ఉన్న క్యూలైన్లు నిండిపోవడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను ఈ కంపార్టుమెంట్లలోకి పంపారు. భక్తులను కూర్చోబెట్టడానికి మొత్తం 30 కంపార్టుమెంట్లు ఏర్పాటు చేశారు. వచ్చిన భక్తులను వచ్చినట్టుగా కంపార్టుమెంట్లలోకి పంపారు. క్యూలైన్లు ఖాళీ అవుతుండగా ఒక్కో కంపార్టుమెంట్ నుంచి భక్తులను క్యూలైన్లలోకి పంపారు. ఆదివారం నిమిషానికి 100 మంది భక్తులకు దర్శనం పూర్తయిందని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 2గంటల వరకు భక్తులతో కనిపించిన కంపార్టుమెంట్లు మూడు గంటలకు ఖాళీ అయ్యాయి. ఆ సమయానికి ఒక కంపార్టుమెంట్‌లో మాత్రమే భక్తులు ఉన్నారు. ఆ తర్వాత వచ్చిన భక్తులు నేరుగా క్యూలైన్లలోకి చేరుకున్నారు. రాత్రి 7 గంటల సమయానికి 1,01,400 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 34,339 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు దర్శన సమయం 2.14 గంటలు పట్టింది. 3,829 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. 2,37,607 లడ్డూలను భక్తులు కొనుగోలు చేశారు. దర్శనానికి వచ్చి తప్పిపోయిన నలుగురు చిన్నారులను చైల్డ్ ట్రేసింగ్ ట్యాగ్ ద్వారా గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. కనకదుర్గమ్మ సోమవారం సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. అమ్మవారి జన్మనక్షత్రం మూల రోజున ఈ అలంకారంలో కనిపిస్తారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

హోరాహోరీగా రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

గుడివాడ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఆవరణలోని బాస్కెట్‌బాల్ కోర్టులో స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 1వ ఎన్టీఆర్ మెమోరియల్ రాష్ట్రస్థాయి ఓపెన్ ఇన్విటేషన్ బాస్కెట్‌బాల్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఆదివారం విజయం కోసం జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో కొనసాగుతున్న పోటీల్లో రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్‌కు అనుబంధంగా ఉన్న 15 జట్లు తలపడుతున్నాయని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు.


బాస్కెట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న జట్లు


కృష్ణానదీపాయలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

కృష్ణానదీపాయలకు పోటెత్తిన వరద

తోట్లవల్లూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు మండలంలోని కృష్ణానదీ పాయలకు ఆదివారం వరద పోటెత్తింది. ఉదయం నుంచి పాయలు నిండుగా ప్రవహిస్తుండటంతో లంక గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. 6 లక్షల క్యూసెక్కుల వరద ప్రవహిస్తోందని, రెండవ ప్రమాద హెచ్చరిక జారీ అయినందున ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కుసుమకుమారి కోరారు.



వస్త్రాలను బహూకరిస్తున్న శ్రీనివాసరావు

ఎన్టీఆర్ స్టేడియం సిబ్బందికి దుస్తులు

గుడివాడ : నందమూరి తారకరామారావు క్రీడా ప్రాంగణంలో పనిచేస్తున్న సిబ్బందికి ఏటీసీ ట్రస్ట్ తరుపున ట్రస్ట్ చైర్మన్, స్టేడియం జీవితకాల సభ్యులు అట్లూరి భవాని ప్రసాద్ బహూకరించారు. ఆదివారం స్థానిక స్టేడియంలోని బాస్కెట్‌బాల్ కోర్టులో సిబ్బందికి నూతన వస్త్రాలను స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.


గుడివాడలో..


గుడివాడ రూరల్‌లో..


కూచిపూడిలో..


పామర్రులో..


పెదపారుపూడిలో..

మహాచండీదేవిగా దుర్గమ్మ


తోట్లవల్లూరులో..

దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఏడోరోజైన ఆదివారం పలు దేవాలయాల్లోని అమ్మవారు మహాచండీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

గుడివాడ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు.ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వి గోపాలరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ పట్టపు చిన్నా, సభ్యులు, దేవాదాయ శాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గౌరీశంకరస్వామి దేవస్థానంలో అమ్మవారు మహాగౌరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. లోక కల్యాణార్థం మహాచండీ యాగం నిర్వహించారు. ధర్మకర్తల కమిటీ చైర్మన్ నెరుసు బోసు, భక్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి దేవస్థానంలో అమ్మవారు మీనాక్షిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మకర్తల కమిటీ చైర్మన్ అంగడాల సతీష్, భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు గజలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ లింగం చిట్టిబాబు, పాల్గొన్నారు.

స్థానిక నీలామహల్ రోడ్డులో వేంచేసియున్న విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గంగు శిరీషా, ధర్మకర్తల కమిటీ చైర్మన్ హరిబాబు, సభ్యులు, దేవాదాయ శాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

స్థానిక బేతవోలులోని ఆనందేశ్వరస్వామి దేవస్థానంలో ఐశ్వర్య ఈశ్వరస్వామి అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గంగు శిరీషా,


పూజల్లో పాల్గొన్న ఈవో కొండలరావు, ధర్మకర్తలు

గుడ్లవల్లేరు : వేమవరం కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మంగళగౌరీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి సహస్రనామార్చన, మంగళకర ప్రాప్తికి, సౌభాగ్యానికి మంగళ గౌరీ మూలమంత్ర దుర్గాదేవి సుక్త మూలమంత్ర హననం నిర్వహించారు. సాయంత్రం సాయంకాలర్చన, అమ్మవారికి ఊంజల సేవ, పంచహారతులు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారిని కౌతవరం సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సుబ్రహ్మణ్యచౌదరి, కౌతవరం సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్‌చైర్మన్ పోతురాజు, గుడ్లవల్లేరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ నాగేశ్వరరావు, శివకుమార్ , రామరాజులు దర్శించుకోగా వారిని సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని నిర్వాహకులు బహూకరించారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో కొండలరావు, చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహనరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ధర్మకర్తల కమిటీ చైర్మన్ బొడమా వీర్రాజు, సభ్యులు, దేవాదాయ శాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


గుడివాడ రూరల్ : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఏడవ రోజు సందర్భంగా ఆదివారం మండలంలో అనేక దేవాలయాల్లో ధాన్యలక్ష్మీగా అమ్మవారు దర్శనమిచ్చారు. చిన ఎరుకపాడులో వేంచేసి ఉన్న అష్టలక్ష్మీ ఆలయంలో అమ్మవారు ధాన్యలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ట్రస్టీ చైర్మన్ బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ట్రస్టీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 2 గంటల వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

కూచిపూడి: శరన్నవరాత్రి మహోత్సవ వేడుకల్లో భాగంగా కూచిపూడిలోని బాలాత్రిపుర సుందరిదేవి అమ్మవారు మహాచండీ దేవిగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. చినముత్తేవి అన్నపూర్ణా సమేత సోమేశ్వరస్వామి దేవాలయంలోని అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కోలాట ప్రదర్శన జరిగింది. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. పెదపూడి, అయ్యంకి, నిడుమోలు, మొవ్వపాలెం, భట్లపెనుమర్రు, పెదసనగల్లు, కాజ, కోసూరు, గూడపాడు తదితర గ్రామాల్లో విశేష పూజలు, కుంకుమార్చన, హోమాది కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పామర్రు : పామర్రులోని గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామిదేవస్థానం (శివాలయం)లో ధనలక్ష్మి దేవిగాను, కరుమారి అంకమ్మతల్లి దేవస్థానంలో సంతానలక్ష్మిదేవిగాను, వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో ధనలక్ష్మి దేవి అలంకారాల్లో ఆదివారం అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు.

పెదపారుపూడి: పెదపారుపూడిలోని బీసీ వాడలోని అమ్మవారు మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు భ్రమరాంబ చెన్నమల్లిఖార్జునస్వామి దేవస్థానంలో ఏడవరోజు ఆదివారం అమ్మవారు మహాచండీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.


సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నిమ్మగడ్డ సత్యసాయి

సమస్యలను పరిష్కరించాలని వినతి

గుడివాడ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేసినట్లు టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి తెలిపారు. ఆదివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన వ్యక్తిగత కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ శనివారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థుల సమస్యలు, గత ప్రభుత్వ హయాంలో జరిగిన నాడు-నేడు పథకంలో అసంపూర్తి భవనాలను పూర్తి చేయాలని కోరినట్టు నిమ్మగడ్డ తెలిపారు.


గుడ్లవల్లేరులో ఎమ్మెల్యే ప్రారంభించనున్న మైక్రోఫిల్టర్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన నేడు

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులో సోమవారం సాయంత్రం పలు అభివృద్ధి పనులను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించనున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి తెలిపారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ప్రారంభించనున్నామన్నారు. ఆ తరువాత అభ్యుదయ పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదిని ప్రారంభించనున్నారని, కొత్త కాలనీలో జల్‌జీవన్ మిషన్ హర్‌ఘర్ జల్ పథకాన్ని ప్రారంభించనున్నారని బాపయ్యచౌదరి తెలిపారు.



వైసీపీ పాపాలను కడిగేస్తున్నాం

● మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి

తోట్లవల్లూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని హిందూ దేవాలయాలను నాటి వైసీపీ ప్రభుత్వం భ్రష్టుపట్టించి హిందూ సమాజాన్ని, ధర్మాన్ని భూస్థాపితం చేయటమే లక్ష్యంగా పనిచేస్తే ఆ పాపాలను కూటమి ప్రభుత్వం మోస్తు కడిగేస్తోందని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామ నారాయణరెడ్డి అన్నారు. దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ధర్మకర్త శివలెంక శరత్‌చంద్ర ఆహ్వానం మేరకు తోట్లవల్లూరు శ్రీమద్ భ్రమరాంబ చెన్నమల్లిఖార్జునస్వామి దేవస్థానాన్ని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాతో కలిసి మంత్రి రామ నారాయణరెడ్డి ప్రత్యేకంగా సందర్శించారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. మహాచండి దేవి అలంకారంలో ఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నాటి వైసీపీ ప్రభుత్వం హిందూ దేవాలయాల పట్ల అనుసరించిన విధ్వంసకర వైఖరిని చెప్పటానికే బాధగా ఉందన్నారు. రాష్ట్రంలోని 361 హిందూ దేవాలయాలను పునర్నిర్మించేందుకు రూ 500 కోట్లు కేటాయించి జీవో ఇచ్చామన్నారు.

ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ పామర్రు నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి మంత్రి రామ నారాయణరెడ్డి రూ 5 కోట్లు ఇవ్వటం హైందవ ధర్మాన్ని నిలబెడుతోందన్నారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్‌వెంకట గురుమూర్తి, చాగంటి తిమ్మారెడ్డి, సర్పంచ్ పెనుముత్స రాధిక, ఆర్డీవో హేలా షారోన్, తహసీల్దార్ ఎం కుసుమకుమారి, ఎంపీడీవో ఉదయ భాస్కర్, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎన్ వెంకట సాంబశివరావు, ఆలయ ఈవో హరి దుర్గా నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ సుజన్‌కుమార్, సుబ్బారెడ్డి, రామినేని కుటుంబయ్య పలు గ్రామాల టీడీపీ నాయకులు,పాల్గొన్నారు.


పట్టువస్త్రాలు తీసుకుని వస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

అంతర్రాష్ట్ర దొంగల ముఠాతో జాగ్రత్త : సీఐ హనీష్

గుడివాడ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన ఆరుగురు సభ్యులతో కూడిన దొంగల ముఠా జిల్లాలో సంచరిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు పట్టణ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని టూటౌన్ సీఐ జె.ఆర్.కె హనీష్ తెలిపారు. ఆదివారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఈ ముఠా ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో దొంగతనానికి పాల్పడ్డారన్నారు. ఈ ముఠా ఎక్కువగా తక్కువ రేటుకు దొరికే లాడ్జిల్లో తలదాచుకుంటారని, ఎప్పుడైనా నేరాలు చేసే అవకాశముందన్నారు. ఎవరైన కొత్త వ్యక్తులు లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 112కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. ఇంటిలో విలువైన అభరణాలు, డబ్బులు బ్యాంకులో దాచుకోవాలని సీఐ హనీష్ ప్రజలకు సూచించారు.

ఘనంగా శతచండీయాగం

గుడివాడ : పెద ఎరుకపాడులో ప్రముఖ ఆడిటర్ మండలి హనుమంతరావు, పద్మ దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం శోభాయమానంగా శతచండీ యాగం నిర్వహించారు. గత పదిహేనేళ్లుగా యాగం, ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. యగం అనంతరం అన్నసమారాధన నిర్వహించి, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

జాషువా రచనలు నేటి సమాజానికి అవసరం

గుడివాడ రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాకవి గుర్రం జాషువా రచనలు, సేవలు నేటి సమాజానికి ఎంతో అవసరమని చౌటపల్లి ప్రముఖులు అట్లూరి నాగేంద్ర ప్రసాద్ అన్నారు. ఆదివారం చౌటపల్లి గ్రంథాలయంలో ప్రముఖ కవి గుర్రం జాషువా జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు గుర్రం జాషువా ఔన్నత్యాన్ని తెలియజేశారు. పల్నాడు ప్రాంతం వినుకొండలో 1895వ సంవత్సరంలో జన్మించారని తెలిపారు. సామాన్య కుటుంబంలో జన్మించి మహాకవిగా ఎదగటం గొప్ప విషయమని తెలిపారు. ఆయన రచనలు, కవిత్వాలు ప్రజల్లో చిరస్థాయిగా నిలిచి ఉన్నాయని కొనియాడారు. అణగారిన వర్గాల కోసం ఎంతో శ్రమించారన్నారు. గ్రంథాలయాధికారి జి.రత్నచంద్, గ్రామస్థులు పాల్గొన్నారు.


తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు : ప్రకాశంజిల్లాకు మహాకవి గుర్రం జాషువా పేరు పెట్టాలని బాబూ జగ్జీవన్ రామ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు పచ్చిగళ్ళ దేవానందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాషువా జయంతి సందర్భంగా ఆదివారం తోట్లవల్లూరు దళితవాడలోని గుర్రం జాషువా విగ్రహానికి ఆయన పూలమల వేసి నివాళులర్పించారు. జాషువా ప్రకాశంజిల్లా వినుకొండలో జన్మించారని, అందుచేత ఆ జిల్లాకు జాషువా పేరుపెట్టి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని దేవానందరావు అన్నారు. వల్లూరు సుదర్శనరావు, సీహెచ్ ఆశీర్వాదం, మట్టా వెంకట్, వంశీ పాల్గొన్నారు.


చౌటపల్లి గ్రంథాలయంలో ..


హనుమంతపురంలో పూర్తికాని భవన నిర్మాణం


అద్దెభవనాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

ఉండీ ఉపయోగమేమీ..!

● అసంపూర్తిగా సచివాలయ భవన నిర్మాణం
● సకాలంలో బిల్లులు చెల్లించని వైనం
● పట్టించుకోని అధికారులు

(పమిడిముక్కల - ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో గ్రామ సచివాలయాల భవనాల నిర్మాణం సంవత్సరాల తరబడి అసంపూర్తిగా నిలిచిపోవడంతో నిరుపయోగంగా ఉంటూ ఆలన పాలన పట్టించుకునే వారు లేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. హనుమంతపురం, కృష్ణాపురం, ఐనపూరు, చోరగుడి, మంటాడ, మేడూరు గ్రామాల్లో సచివాలయ భవనాల నిర్మాణం అర్థాంతరం గా నిలిచిపోయి ఎందుకు ఉపయోగపడకుండా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో పలు గ్రామాల్లో సచివాలయ భవనాల నిర్మాణం ప్రారంభించినప్పటికి బిల్లులు చెల్లించకపో వడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటివరకూ వాటిగురించి పట్టించుకున్న దాఖల్లాల్లేవని గ్రామస్థులు వాపోతున్నారు. హనుమంతపురంలో సచివాలయ భవన నిర్మాణం మూడొంతులకు పైగా పూర్తయినప్పటికి విద్యుత్, ఇతర ఫినిషింగ్ పనులు పూర్తి కాకపోవడంతో పట్టించుకునేవారు లేక పాడైపోతూ అసాంఘిక కార్యక లాపాలకు ఉపయోగపడుతుందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు

గ్రామాల్లో సచివాలయ భవనాల నిర్మాణ పనులకు సంబంధించి బిల్లులు చెల్లించకపోవడంతో పనులు పూర్తిచేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రావడంలేదు. ఎవరైనా వస్తే పనులు పూర్తిచేయించి భవనాలు వినియోగంలోకి తీసుకు వస్తాం.

సీతారామరాజు, ఎంపీడీవో.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఒక్కరోజు ఆదాయం రూ.9.87 లక్షలు



మోపిదేవి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. నాగపుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు, ఆదివారం ప్రత్యేకత కావటంతో వేలాదిగా వచ్చిన భక్తులు నిర్వహించిన వివిధ సేవల ద్వారా ఒక్కరోజులోనే రూ.9,87,942 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు.



డీఆర్కే ప్రసాద్‌కు విరాళం అందజేస్తున్న డాక్టర్ గోపాళం శివన్నారాయణ

స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తిదాయకం

● డాక్టర్ గోపాళం శివన్నారాయణ

చల్లపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పరిశుభ్రత కోసం పదేళ్లుగా నిస్వార్థంగా స్వచ్ఛ చల్లపల్లి సేవ నిర్వహించటం స్ఫూరిదాయకమని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపాళం శివన్నారాయణ అన్నారు. ఆదివారం 3605వ రోజు స్వచ్ఛసేవలో డాక్టర్ శివన్నారాయణ పాల్గొన్నారు. తెల్లవారుజామునే కార్యకర్తలతో కలిసి స్వచ్ఛ సేవలు అందించి కార్యకర్తలతో మాట్లాడారు. చల్లపల్లిని సందర్శించినప్పుడల్లా తనవంతుగా అందించే విరాళాన్ని డాక్టర్ డీఆర్‌కె.ప్రసాద్‌కు అందచేశారు. వైద్యరంగంలో ఆదర్శవంతమైన డాక్టర్ డీఆర్‌కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతుల నేతృత్వంలో స్వచ్ఛ కార్యకర్తలు ప్రతిఫలాపేక్ష లేకుండా స్వచ్ఛసేవలు అందించటం అసామాన్యమని ప్రశంసించారు. తమ కోసం కాకుండా గ్రామంకోసం సేవలందిస్తున్న కార్యకర్తలు ధన్యజీవులని అభినందించారు.



కనిగిరిలంక పోతురాజు బృందం మురళీ కోలాటం ప్రదర్శన

అట్టహాసంగా మురళీకోలాటం పోటీలు

ఘంటసాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఏడు రోజులుగా తాళం భజన పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆదివారం మురళీ కోలాటం పోటీలు అట్టహాసంగా ప్రారంభించారు. తోట్లవల్లూరు మండలం కనిగిరిలంకకు చెందిన పోతురాజు మురళీకోలాట సమాజానికి చెందిన సభ్యుల ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. ఈ పోటీలను కొడాలి పీఏసీఎస్ చైర్మన్ గుత్తికొండ వరప్రసాద్ పర్యవేక్షించగా, న్యాయనిర్ణేతలుగా పొడుగు ప్రసాద్, శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు.

బాలకృష్ణపై వ్యక్తిగత విమర్శలను సహించం

● నందమూరి అభిమానుల ఆగ్రహం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సినీ నటుడు నందమూరి బాలకృష్ణపై వ్యక్తిగత విమర్శలను సహించేది లేదని, వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలని నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ నాయకులు మెట్టు సూరిబాబు, విశ్వనాథపల్లి విజయ్ అన్నారు. మచిలీపట్నంలోని ఈశ్వర్ రెసిడెన్సీలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. సైకో పోవాలి. సైకిల్ రావాలి అనే నినాదంతో 2024 ఎన్నికల్లో ప్రజలు జగన్‌ను గద్దె దించారన్న విషయాన్ని వైసీపీ నాయకులు మరచిపోయినట్టు ఉన్నారన్నారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా లక్షలాది మంది పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్న సేవకుడు బాలకృష్ణ అన్నారు. బాలకృష్ణ అభిమానులు గణపతి, వెంకన్న, శ్రీనివాస్, యుగంధర్, బుజ్జిబాబు, గంగా, సత్యం తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పెద్దిరాజు

మత్స్యకారులకు పథకాలు అందేలా కృషి

నాగాయలంక, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు కేంద్ర, రాష్ట్రాల పథకాలను అందేటట్లు కృషి చేస్తానని మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు హామీ ఇచ్చారు. స్థానిక ఫుడ్ కోర్టు భవనంలో మత్స్యకార ప్రతినిధుల సమావేశం జరిగింది. మత్స్యకార సంఘ నాయకులు, జిల్లా టీడీపీ నేత లకనం నాగాంజనేయులు అధ్యక్షత వహించి మండలంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. పెద్దిరాజు మాట్లాడుతూ "త్స్యకారులలో ఉన్న ఉప కులాల సమస్యలను అధ్యయనం చేసి సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఆక్వా ల్యాబ్ ఏర్పాటు చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నట్లు తెలిపారు. వరదలు రావటంతో ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు సాయం అందించాలని ప్రభుత్వానికి నివేదిస్తానన్నారు. చైర్మన్‌ని మత్స్యకారుల సంఘ నేతలు ఘనంగా సత్కరించారు. జిల్లా మత్స్యకారుల సంఘం నేతలు నడకుదుటి అర్జున్, సైకం భాస్కరరావు, లంకే నారాయణ ప్రసాద్, కర్రి కృష్ణమూర్తి, విశ్వనాథపల్లి భీక్షం, సైకం విజయభాస్కరరావు తదితరులు మత్స్యకారుల సమస్యలను ఆయనకు వివరించారు.

సముద్రంలో మునిగిపోతున్న యువకుడిని కాపాడిన మెరైన్ పోలీసులు

మచిలీపట్నం క్రైమ్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రమాద వశాత్తు యువకుడు సముద్రంలో మునిగిపోతున్న యువకుడిని మెరైన్ పోలీసులు రక్షించి ఆసుపత్రికి తరలించిన సంఘటన మంగినపూడి బీచ్‌లో ఆదివారం జరిగింది. గన్నవరంలోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేసే హరిప్రీత్ సింగ్ స్నేహితులతో కలసి ఆదివారం మంగినపూడి బీచ్‌కు వచ్చి సముద్రంలో స్నానానికి దిగాడు. అలల తాడికికి సముద్రంలో హరిప్రీత్‌సింగ్ మునిగిపోతున్న విషయాన్ని గ్రహించిన స్నేహితులు మెరైన్ పోలీసులకు చెప్పడంతో వారు అతడిని కాపాడారు. హరిప్రీత్ సింగ్‌కు ప్రథమ చికిత్స నిర్వహించి బందరు ప్రభుత్వాసుపత్రికి పంపి, మెరుగైన చికిత్స కోసం విజయవాడ ఆసుపత్రికి తరలించారు.

దాడి ఘటనలో యువకుడికి గాయాలు



మచిలీపట్నం క్రైమ్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): యువకుడిపై ఐదుగురు విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచిన సంఘటన ఇంగ్లీషుపాలెంలో జరిగింది. నోబుల్ కాలనీకి చెందిన సాయిని బుడ్డి, మరో నలుగురితో కలిసి అడ్డగించిం కర్రలతో దాడి చేసి బ్లేడుతో గాయపరిచాడు. బాధితుడు స్థానికుల సహాయంతో ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. చిలకలపూడి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు, నిందితుడు కూడా గతంలో గంజాయి విక్రయించిన కేసులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



కన్యకా పరమేశ్వరి ఆలయంలో..



మడక శివాలయంలో



చండీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మండలి



విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ



గణపేశ్వరంలో ..

మహాచండీ..పాహిమాం

● జిల్లా వ్యాప్తంగా జగన్మాతకు భక్త నీరాజనం



తల్లులకు పూజలు చేస్తున్న చిన్నారులు



కలశయాత్రలో చల్లపల్లి ఆర్యవైశ్య సంఘం మహిళలు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దేవీశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రధాన దేవాలయాల్లో అమ్మవారిని పరాశక్తిగా అలంకరించారు. మహిళలు సహస్రనామార్చన పారాయణ చేశారు. గుండుపాలెంలోని దేవాలయంలో అమ్మవారికి కుంకుమార్చన జరిపారు. కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో తల్లుల పాదాలకు చిన్నారులు పూజలు చేశారు. గాంధీబొమ్మ శివాలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. **పెడన :** పైడమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు ఆదివారం పరాశక్తిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దాసు శ్యామ్, వాణి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఈవో జి.వి. కృష్ణారావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు తదితరులు పాల్గొన్నారు. కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారు మహాచండీ అలంకారంలో భక్తులకు కటాక్షించారు. సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. లలితా పారాయణం చేశారు. బాల బాలికల కోలాట నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా పర్యవేక్షించారు. **పెడన రూరల్ :** మడకలో భోగలింగేశ్వరస్వామి ఆలయంలో కాత్యాయని దేవి అలంకరణ చేశారు. చెన్నూరు నారాద లింగేశ్వర స్వామి, ఉరివి సోమేశ్వర స్వామి, ఉప్పలకలవగుంట, నడుపూరు, నందిగం, లంకలకలవగుంట, బల్లిపర్రు, చోడవరం శివాలయాలలో అమ్మవారికి విశేష అలంకారులు చేసి పూజలు జరిపారు. **గూడూరు :** మల్లవోలు శివాలయంలో అమ్మవారు పరాశక్తిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

చల్లపల్లి : వాసవీక్లబ్ ఆధ్వర్యంలో కలశయాత్ర చేశారు. వాసవీక్లబ్ అధ్యక్షురాలు మాజేటి అమరవాణి, కార్యదర్శి గోళ్ల వెంకటరత్నం, కోశాధికారి కిరణ్, వరదా రాజశేఖర్, కొల్లిపర నరేంద్ర, వరదా హరిగోపాల్, దింటకుర్తి జ్యోతి, శ్రీదేవి పాల్గొన్నారు. మహాచండీదేవి అలంకారంలో వాస వీ అమ్మవారిని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు ఆదివారం రాత్రి దర్శించుకున్నారు. కమిటీ పెద్దలు కొల్లిపర మధు, ఉడత్తు బాబు, జూపూడి సాయి, వరదా హరిగోపాల్, కొల్లిపర నరేంద్ర, గోళ్ల రాంప్రసాద్, వరదా రాజశేఖర్, వరదా హరిగోపాల్, తమ్మన సతీష్‌కుమార్, కృష్ణాజిల్లా ఆర్యవైశ్య రాజకీయ విభాగం నాయకులు జల్లూరు ప్రసాద్ ఎమ్మెల్యే దంపతులకు పట్టువస్త్రాలు సమర్పించి సత్కరించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఆర్యవైశ్యసంఘం, యువజనసంఘం, వాసవీక్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. రాజ్యలక్ష్మి హాస్పటల్ బజారులో ముత్యాల చంటి, మంగళాపురంలో టీఎన్‌టీయూసీ నేత చం ద్ర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. **నాగాయలంక :** గణపేశ్వరం దుర్గా గణపేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరిదేవిగా దర్శనం ఇచ్చారు. అర్చకులు పోతుకూచి సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. ధర్మకర్త మండల శ్రీరామచంద్రమూర్తి, ఈవో సిహెచ్.సుధాకర్‌రావు పర్యవేక్షించారు. నాగాయలంకలో ఇతర దేవాలయాల్లో అమ్మవారు మహాచండీదేవిగా దర్శనమిచ్చారు. చిట్టా సాంబశివరావు పర్యవేక్షించారు. **అవనిగడ్డ :** అవనిగడ్డ రాజరాజేశ్వరీ అమ్మవారు, లంకమ్మ అమ్మవార్లు గంగాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. **అవనిగడ్డ రూరల్ :** పులిగడ్డలో కనక దుర్గమ్మకు మహాచండీ యాగాన్ని నిర్వహించారు. మండలి వెంకట కృష్ణారావు (బాబు) ఏర్పాట్లు పర్యవేక్షించారు. వేకనూరు అంకాలమ్మకు మహాచండీ దేవి అలంకారాన్ని చేసి శ్రీనివాస పెరుమాళ్ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. **కోడూరు :** విశ్వనాథపల్లి, మందపాకల గ్రామాల్లో అద్దంకి నాంచారమ్మ, కోడూరు కనకదుర్గమ్మ, గంగానమ్మ మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. **మోపిదేవి :** పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి, కొక్కిలిగడ్డ మల్లేశ్వరస్వామి, కె.కొత్తపాలెం, దుర్గాకోటేశ్వర స్వామి ఆలయాల్లో అమ్మవారు మహాచండీదేవిగా పూజలందుకున్నారు.

డివిజన్ మెడికల్ లేబొరేటరీల కార్యవర్గం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం డివిజన్ మెడికల్ లేబొరేటరీల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక ఆదివారం సత్య కన్వెన్షన్ హాలులో జరిగింది. రాష్ట్ర కార్యదర్శి శర్మ పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికల్లో గౌరవాధ్యక్షుడిగా పి. రాంబాబు, సలహాదారులుగా ఏ.పవన్‌కుమార్, ఎం.ఎస్.వి. రామారావు, ఎస్. అంకినీడు, పి. అశ్వనీకుమార్ ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా బొల్లా పాండురంగారావు, కార్యదర్శిగా కొల్లూరు కృష్ణ, ఉపాధ్యక్షుడుగా పి.వి.కె.ఎన్.వి. రాధాకృష్ణ, కోశాధికారిగా ఎస్.వి.ఎస్.రామలింగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా గడ్డిపాటి మంజూష, కిరణ్, ఈసీ మెంబర్లుగా విజయబాబు, హరిబాబు, బాల సుబ్రహ్మణ్యం, కె. రవికుమార్‌లను ఎన్నుకున్నారు. శర్మ మాట్లాడుతూ, ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర అసోసియేషన్ సభ్యులు పి. రామమోహనరావు, కె. శామ్యూల్, సిహెచ్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జాషువా రచనలు అజరామరం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జాషువా రచనలు అజరామరమని సిరికవి డాక్టర్ చిం తలపాటి మురళీకృష్ణ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో జాషువా జయంతి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సాహితీమిత్రుల అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ, పరిషత్ అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్, డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు. జ్యోతీబాపూలే విజ్ఞాన కేం ద్రంలో గుర్రం జాషువా చిత్రపటానికి సాహితీ స్రవంతి మచిలీపట్నం కన్వీనర్ పి. రాందేవ్ తదితరులు నివాళులర్పించారు. వై. నరసింహారావు, సిహెచ్. రాజేష్, కొడాలి శర్మ, సుబ్రహ్మణ్యం, కె. రాజారావు, బుర్రే రాజు, ఎన్.ఎస్. నారాయణ, కె. వసంతరావు, సిహెచ్. జయరావు,. ధనశ్రీ, భవానీ పాల్గొన్నారు.

ఎంవీకే స్మారక వైద్యశిబిరం

అవనిగడ్డ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకల్లో భాగంగా గాంధీక్షేత్రంలో ఏర్పాటు చే సిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. టీడీపీ నేత కొనకళ్ల జగన్నాథం (బుల్లయ్య)తో కలసి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ప్రముఖ గుండె వైద్యనిపుణులు పళ్లెం పెద్దేశ్వరరావు వైద్య సేవలు అందించారు. మండలి ఆశయాలను కొనసాగుతున్న బుద్ధప్రసాద్‌ను, వెంకట్రామ్‌లను అభినందించారు. డాక్టర్ పళ్లెం ఆకాష్, గాంధీక్షేత్రం కమిటీ ముఖ్యులు మత్తి శ్రీనివాసరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు, ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మత్తి వెంకటేశ్వరరావు, రాయపూడి వేణుగోపాలరావు, యాసం చిట్టిబాబు, నడకుదుటి జనార్థనరావు, మెండు లక్ష్మణరావు, పైడిపాముల కృష్ణకుమారి, బోలెం నాగమణి, పైడిపాముల స్వప్న, కూటమి నేతలు పాల్గొన్నారు.

కోడూరు : మాచవరం వంతెన సెంటర్‌లో మండలి వెంకట్రామ్ తదతరులు వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు.



పెనుమల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఊచా వెంకయ్యనాయుడు

పెడన రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పెనుమల్లి వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఊచా వెంకయ్య నాయుడు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా పడమట రంగారావు, బొట్ల పుణ్యవతితో సీఈవో వెంకటేశ్వరరావు ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్ విచ్చేశారు. అధ్యక్షుడు ఊచా వెంకయ్య మాట్లాడుతూ రైతులకు మేలు చేస్తానన్నారు. శీరం ప్రసాద్, సత్యన్నారాయణ, నల్లమోతు రఘురాం, పావని, అంకెం వీరవెంకటేశ్వరరావు, సమ్మెట రాంబాబు, ఘంటయ్య, నాయకులు పాల్గొన్నారు.

తీర గ్రామాలకు వరద



శ్రీకాకుళం ర్యాంపు వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న వీఆర్వో గోపి

ఘంటసాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దిగువకు కృష్ణానది నీటిని వదలడంతో ఘంటసాల మండలం శ్రీకాకుళం, పాపవినాశనం పరిధిలోకి భారీగా వరద నీరు చేరింది. మధ్యాహ్నం 6 లక్షల క్యూసెక్కుల వరద నీరు వదిలినట్లుగా అధికారులు తెలపటంతో మరింతగా ఎక్కువ అయ్యే ప్రమాదం ఉండటంతో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అప్రమత్తమయ్యారు. కృష్ణానదిలోకి ఎవరు వెళ్లకుండా సూచనలు చేశారు. **చల్లపల్లి :** కృష్ణానదిలో వరద నీటి ప్రవాహం ఉధృతంగా సాగుతుండటంతో నదీతీరాన వాణిజ్య పంటలు సాగుచేసే మెట్ట రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటిమట్టం క్రమేపీ పెరుగుతుండటంతో నది వెంబడి ఉన్న పంట చేలు నీటిముంపునకు గురవుతున్నాయి. రాముడుపాలెం పుష్కరఘాట్ మెట్లు పూర్తిగా నీటమునిగి రోడ్డు మీదకు నీరు వస్తోంది. నడకుదురులో రేవులోకి వెళ్లే తారురోడ్డు మీదకు నీరు రాగా, పంట చేలు సమాంతరంగా మారాయి. పంట చేలకు వెళ్లే బాటలమీదుగా నీటి ప్రవాహం సాగుతోంది. పసుపు, అరటి, మినుము తదితర వాణిజ్య పంటలు నీటిముంపునకు గురవుతున్నాయి. పంటచేలల్లోని మోటార్లు దెబ్బతినకుండా కూలీల సహాయంతో మోటార్లను కరకట్ట మీదకు చేరుస్తున్నారు. నదిమధ్యలో ఉండే లచ్చిగానిలంకకు వరద నీరు ఎక్కే అవకాశం ఉంది. ఆముదార్లంక గ్రామం పల్లపు ప్రాంతాల్లోకి వరదనీరు వచ్చి చేరుతోంది. పోలీసు, రెవెన్యూ యంత్రాంగం ఆముదార్లంకలో పరిస్థితిని సమీక్షిస్తున్నారు. **మోపిదేవి :** వరద ఉధృతి తీవ్రంగా పెరుగుతుండటంతో నదీ తీర గ్రామాలైన కె.కొత్తపాలెం, బొబ్బర్లంక వద్ద పంటలు నీటి ముంపునకు గురయ్యాయి. కె.కొత్తపాలెం దళితవాడలోని గృహాల్లోకి వరద నీరు చేరింది వరద మరింత పెరుగుతుందని అధికారులు చెబుతుండటంతో రైతులు, నదీ తీర ప్రాంత గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉండటంతో తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.హరనాథ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రావి రత్నగిరి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, దివి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుప్పాల ఏసు, పీఏసీఎస్ చైర్మన్ బల్లా సీతారామ ప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కె.కొత్తపాలెం దళితవాడ వద్ద గ్రామంలోకి వరద నీరు చొచ్చుకు వస్తున్న ప్రదేశాన్ని పరిశీలించి దళితవాడ ప్రజలకు పలు సూచనలు చేశారు. ఏ విధమైన విపత్తునైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం యంత్రాంగం సిద్ధంగా ఉందని, ఆందోళనకు లోనుకావద్దని తెలిపారు. నీటమునిగిన పసుపు పంటను రైతులతో కలసి పరిశీలించారు. వరద ఉధృతి పెరుగుతుండటంతో ఉత్తర చిరువోలులంక, అయోధ్య, కె.కొత్తపాలెం వద్ద అవుట్ పాల్ స్లూయిస్ గేట్ల నుంచి నీరు లీకేజీ కాకుండా తక్షణమే చర్యలు తీసుకుంటున్నట్లు డీఈఈ గోపినాథ్ తెలిపారు. కృష్ణానది కరకట్ట, అవుట్ పాల్ స్లూయిస్ గేట్లను స్థానిక సిబ్బందితో పరిశీలించారు. వరద వస్తున్న సమయంలో షట్టర్ల నుంచి నీరు బయటకు వచ్చి పంట పొలాలు మునిగిపోయే అవకాశం ఉందని రైతులు తెలిపారు. నీరు బయటకు రాకుండా ఇసుక బస్తాలు వేసి పంటలను కాపాడేలా చూస్తామని ఆయన తెలిపారు. ఏఈలు హరీష్, రామ్ కుమార్, లస్కర్ వెంకన్న తదితరులు ఉన్నారు. **నాగాయలంక :** నాగాయలంక రేవులో గంట గంటకు వరద ఉధృతి పెరుగుతోంది. ఆదివారానికి నాగాయలంక శ్రీరామపాద క్షేత్రంలోని పుష్కరఘాట్‌కు భారీగా వరద నీరు చేరింది. గ్రామస్థులు, సందర్శకులు రేవులోకి వెళ్లకుండా పోలీసు శాఖ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు నీటిలో మునిగాయి. ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఆదివారం ఏ అధికారులు రేవుకి రాలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

ప్రతిబింబం



ప్రకాశం బ్యారేజీ నుంచి సాగరసంగమం వద్ద సముద్రంలో కలిసేందుకు వస్తున్న కృష్ణమ్మ నీటిలో నడకుదురు వద్ద సాయం సంధ్యవేళ ప్రతిబింబిస్తున్న చెట్లు
(ఆంధ్రజ్యోతి - చల్లపల్లి)



జీఎస్టీ తగ్గింపు వివరాలతో కూడిన కరపత్రాలను చూపుతున్న డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి

జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతికి ఊరట

చల్లపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ తగ్గింపుతో పేద మధ్యతరగతి కుటుంబాలకు ఊరట కలుగుతుందని వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.స్వరూపరాణి అన్నారు. రామలింగ చౌడేశ్వరీదేవి కల్యాణమండపంలో జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలపై వ్యాపారులు, ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రతి కుటుంబానికి రూ.15వేల వరకు ఆదా అవుతుందన్నారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, మండల పరిషత్ సూపరింటెండెంట్ షేక్ అతావుల్లా, కార్యదర్శి పివి.మాధవేంద్రరావు పాల్గొన్నారు.

పెడన కౌన్సిల్ సమావేశం నేడు

పెడన, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పెడన మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ లింగారెడ్డి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఛైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన జరిగే సమావేశంలో అజెండాలోని 29 అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటారన్నారు.

ఘనంగా షిర్డి సాయినాథుని జయంతి వేడుకలు

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పులిగడ్డలో షిర్డి సాయినాథ సేవాశ్రమంలో ఆదివారం షిర్డి సాయిబాబా 109వ జయంతి వేడులను ఘనంగా నిర్వహించారు. సామూహిక సత్యవ్రతాలు నిర్వహించారు. బాబా పల్లకీ సేవ మహోత్సవాన్ని నిర్వహించారు. అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు నరసింహారావు, దుర్గారావు పర్యవేక్షించారు.